
# ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY



# నల్లగొండ

5

గురువారం 8 మే 2025


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 66

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.170 | 260 | 290 |
| సూర్యాపేట | రూ.174 | 260 | 290 |
| నల్లగొండ | రూ.165 | 245 | 270 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 22.0



# అంతటా ఉద్వేగం

- ఆపరేషన్ 'సింధూర్'పై హర్షం
- రోజంతా ఫోన్లు, టీవీలకే అతుక్కుపోయిన ప్రజలు
- దాడుల వీడియోలతో హోరెత్తిన సోషల్ మీడియా
- నిఘా పెంచిన పోలీసులు
- మతసామరస్యాన్ని చాటిన ఉమ్మడి జిల్లా ప్రజలు

పహల్గామ్ ఉగ్రదాడికి బదులుగా భారత త్రివిధ దళాలు దాయాది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ 'సింధూర్' పేరుతో చేసిన వైమానిక దాడులు ఉమ్మడి జిల్లా ప్రజల్లో ఉద్వేగాన్ని నింపాయి.

- (ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్)

పాకిస్థాన్‌లో బుధవారం తెల్లవారు జామున 1.45 గంటలకు చేసిన ఈ దాడులు ఇండియన్ ఆర్మీ ఎక్స్ (ట్విట్టర్) పోస్టుతో వెలుగు చూశాయి. ఆ వెంటనే సోషల్ మీడియా, టీవీ చానెల్స్‌లో బ్రేకింగ్ వార్తలు వెల్లువెత్తాయి. అప్పటివరకు మెళకువతో సెల్‌ఫోన్లకు, టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు దాడి వార్తలతో హర్షం వ్యక్తం చేశారు. ఆ వెంటనే వారు కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో పాటు పలువురికి ఫోన్లు చేసి వార్తను పంచుకున్నారు. తెల్లవారుజామున నిద్రమత్తును వీడి 15 రోజులుగా పడుతున్న బాధకు ప్రధాని నరేంద్రమోదీ శుభం పలికారని కొనియాడారు. టీవీల చానెల్స్ మారుస్తూ సైనికుల పరాక్రమాన్ని కనులారా చూసి పులకించారు. మీడియా సమావేశంలో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపిన తీరును సైనిక అధికారులు వివరించగా, ఆపరేషన్ 'సింధూర్' పేరు ఎంపికకు కారణాలను వివరిస్తున్న క్రమంలో టీవీలను చూస్తున్న పలువురు ఉద్విగ్నతకు గురయ్యారు. అనంతరం ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఆలకించారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ల డీపీలు, స్టేటస్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర సోషల్ మీడియాల్లో ఆపరేషన్ సింధూర్ లోగో, మిసైల్స్ దాడుల పోస్టులతో నిండిపోయాయి. ఏ ఇద్దరు కలిసినా ఆపరేషన్ 'సింధూర్'పైనే చర్చ, మాట ముచ్చట సాగింది. అయితే పహల్గామ్ దాడి పేరుతో మత విద్వేషాలను సృష్టించాలనుకున్న పాకిస్థాన్ పన్నాగానికి భిన్నంగా ఉమ్మడి జిల్లా ప్రజలు సామరస్యంగా ఉండి పరిణతి చాటారు.



వలిగొండ శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల మాక్ డ్రిల్

### నా కుమారుడు సైనికుడైనందుకు గర్వంగా ఉంది



నా కుమారుడు సైనికుడైనందుకు గర్వపడుతున్నా. సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో మాలో ఆందోళన ఉంది. కానీ, దేశ రక్షణ కోసం యుద్ధ రంగంలో నా కుమారుడు ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. దేశ కోసం తన వంతు త్యాగం చేస్తానంటూ ఇష్టంతో సైన్యంలోకి వెళ్లాడు. పహల్గామ్ దాడులు జరిగినప్పటి నుంచి ప్రతి రోజూ ఫోన్‌లో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నా. కానీ, ప్రతిసారి మాట్లాడలేకపోతున్నాడు. టీవీల్లో యుద్ధ వార్తలు చూస్తున్నప్పుడు భయమేస్తోంది. ఆ వెంటనే తేరుకొని మాకు మేం ధైర్యం చెప్పుకుంటూ దేశం గెలవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం.

- రత్నపురం వెంకటమ్మ, భువనగిరి

### సైనికుల కుటుంబాల్లో..

ఆపరేషన్ 'సింధూర్' నేపథ్యంలో సైనికుల కుటుంబాలు ఉద్వేగానికి గురయ్యాయి. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భారత సైన్యంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నవారు ఉన్నారు. దాయాది పాకిస్థాన్‌తో యుద్ధ మేఘాలు అలుముకుంటుండడంతో సైనికుల సంక్షేమం, భద్రతపై ఇక్కడున్న తల్లిదండ్రులు, భార్యలు, పిల్లల్లో ఆందోళన నెలకొంది. అయినా దేశ భద్రతకు తమ కుటుంబం త్యాగం చేస్తోందని గుండె నిబ్బరం చేసుకున్నారు. పరిచయస్థులు సైనికుల కుటుంబీకులను కలుస్తూ ధైర్య వచనాలు చెబుతున్నారు. సెలవులను రద్దు చేయడంతో ఇళ్లకు వచ్చిన సైనికులంతా తిరుగు ముఖంపట్టారు. అలాగే పోలీసులకు అన్ని రకాల సెలవులను కూడా రద్దు చేసి వెంటనే విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పోలీసులు ఉమ్మడి జిల్లా అంతటా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేసి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. వలస కార్మికుల వివరాలు నమోదు చేస్తున్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

**ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్**



డిపోలో మొక్కలు నాటుతున్న ఈడీ ఖుస్రో షా ఖాన్

నల్లగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్ అన్నారు. బుధవారం నల్లగొండ డిపోను ఆయన సందర్శించి, డిపో ఆవరణలో మొక్క నాటారు. అనంతరం బస్సులను, గ్యారేజీని పరిశీలించి మెకానికల్‌లు, డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడారు. సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయన వెంట రీజనల్ మేనేజర్ కె.జానిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## చిన్నారుల రక్షణ కోసం 'ఊయల'



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఊయల

నల్లగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): వదిలివేసిన పిల్లలను సంరక్షించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి, శిశు గృహ, అన్ని ప్రసుతి వైద్యశాలల్లో ప్రత్యేకంగా ఊయల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి మాట్లాడుతూ, జిల్లాలో ఎవరైనా పిల్లలను వదిలి వేయడం లాంటివి చేయకూడదన్నారు. పిల్లలను పోషించలేని తప్పని పరిస్థితి ఉంటే ఊయలకు అప్పగించాలని కోరారు. ఎవరికైనా పిల్లలు కావాలంటే మహిళ శిశు సంక్షేమశాఖ అధికారులను సంప్రదించి చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని,సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, సభ్యుడు ఈద భాస్కర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ కుమారి, మెడికల్ ఆఫీసర్ రజిని, బీఆర్‌బీ కోఆర్డినేటర్ హరిత, డీసీపీయూ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. అందుకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. రైతుల ప్రయోజనం కోసం ఈ సారి రెండు నెలల ముందే అధికారులు ఈ ప్రణాళికను రూపొందించారు. ప్రధానంగా కూరగాయల సాగు గణనీయంగా పడిపోతుండటంతో, వీటి విస్తీర్ణాన్ని పెంచేందుకు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



# ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు

- కూరగాయల సాగుతో పాటు పలు పంటలకు రాయితీలు
- మల్బరీ తోటలపై దృష్టి సారించిన అధికారులు
- సబ్సిడీపై డ్రిప్ మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో కూరగాయల సాగు పెంచాల్సిన అవసరంపై అధికారులు ఇప్పటికే నివేదిక సిద్ధం చేశారు. ఈ రెండు జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లాలో కూడా ఉద్యాన పంటలను పెద్ద సంఖ్యలో ప్రోత్సహించనున్నారు. కేవలం బత్తాయి, నిమ్మ పంటలేగాక ఇతర పంటలను కూడా విస్తరిస్తే రైతులు ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయి. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేసి కార్యాచరణకు ఆమోదం తెలిపింది. గతంలో బత్తాయి తోటలు పెద్ద సంఖ్యలో ఉండేవి. రానురానూ తోటలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో ఉద్యాన పంటల్లో భాగంగా అన్నింటి సాగుకు ప్రోత్సాహకాలు ఇస్తూ రైతులకు ప్రయోజనం చేకూర్చాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

**2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలు**

రాష్ట్ర ప్రభుత్వం 2025-26లో ఉద్యాన పంటల ప్రణాళికను వెల్లడించింది. ఆయిల్‌పామ్ సాగును విస్తరించడంలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సూక్ష్మనీటి పారుదల పథకం సమన్వయంతో మూడు జిల్లాల్లో దాదాపు 15వేల ఎకరాలకు లబ్ధిదారులకు మొక్కలను పంపిణీ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 6500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళికలను రూపొందించారు. డ్రిప్‌ను సైతం రాయితీపై అందించనున్నారు. రైతులు ముందుకు వస్తే సుమారు 12.50లక్షల ఎకరాలకు రాయితీపై డ్రిప్ అందించనున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలకు ఇప్పటికే రాయితీ ఇస్తున్నారు. పీఎంకేఎస్‌వై (ప్రైమ్‌మినిస్టర్ క్రిషి సించాయి యోజన) కింద పండ్ల తోటలతో పాటు కూరగాయలకు, మిరప, ఆయిల్‌పామ్ సాగుకు బిందు, తుంపర సేద్యాన్ని రాయితీపై పరికరాలు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100శాతం రాయితీ, బీసీ, సన్నచిన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీ ఇవ్వనున్నారు.

**సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకంలో**

సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్)లో


మిగతా 7వ పేజీలో...


**రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి**

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యాన పంటలతో పాటు కూరగాయల సాగుకు, ఇతర పంటల సాగుకు ప్రోత్సాహం అందుతుంది. ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. డ్రిప్‌ను కూడా సబ్సిడీపై అందజేస్తాం. ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం.

- పి.అనంతరెడ్డి, ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి, నల్లగొండ

## ఉపాధి ముమ్మరం.. సౌకర్యాలు మృగ్యం

ఆంధ్రజ్యోతి విజిట్


• 6లో..


- తాగునీరు, టెంట్ కరువు
- వేసవిలో తల్లడిల్లుతున్న కూలీలు
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు
- అప్పుడప్పుడు ఓఆర్ఎస్



వాసవీ కన్యాక పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా నల్లగొండలో నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


• 8లో..


## విశ్రాంత ఆవేదన

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూపులు
- ఒక్కొక్కరికీ రూ.50 నుంచి రూ.70లక్షల వరకు బకాయిలు
- సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 1,037మంది రిటైర్


• 7లో..


## ధాన్యం లారీలు రాకుండా చెక్‌పోస్టు వద్ద పకడ్బందీ చర్యలు

**ఎస్పీ శరత్‌చంద్ర పవార్**



వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దామరచర్ల, మే 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రాంతం నుంచి ధాన్యం లారీలు రాకుండా రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం వాడపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేసి పలు రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అనంతరం వాడపల్లి చెక్‌పోస్టును తనిఖీచేసి మంగళవారం రాత్రి ఆంధ్రా నుంచి వచ్చిన ధాన్యం లారీ పట్టుబడగా పరిశీలించారు. ఆంధ్రా నుంచి అక్రమంగా ధాన్యం లారీలు రాకుండా వాడపల్లి, విజయపురి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఇప్పటికే అక్రమంగా ధాన్యాన్ని తరలిస్తున్న ఏడు లారీలను పట్టుకొని కేసులను నమోదు చేశామన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ పీఎండీ.ప్రసాద్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

**అవార్డు గ్రహీతలకు ఎస్పీ అభినందన**

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): తెలంగాణ రియల్ హీరోస్ అవార్డు గ్రహీతలను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. కొన్ని నెలల క్రితం అంతర్ రాష్ట్ర దొంగల ముఠా, పార్థీ గ్యాంగ్‌ను చాకచక్యంగా పట్టుకున్న బృందంలో సభ్యులుగా ఉన్న సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్, ఐటీ కోర్ విభాగం గిరితో పాటు కానిస్టేబుల్ విక్రమ్ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి తెలంగాణ రియల్ హీరోస్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు.



## కేజీబీవీ విద్యార్థినికి విమాన ప్రయాణం

- హామీ నిలబెట్టుకున్న నల్లగొండ జిల్లా కలెక్టర్
- 10/10 జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం చేయిస్తానని గతంలో హామీపత్రం
- విమాన ప్రయాణం, సౌకర్యాలకు సొంత ఖర్చుతో ఏర్పాట్లు


• 6లో..


## రైతుల నుంచి పైసలు తీసుకుంటే చర్యలు

**ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం**



శాపల్లిలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నార్కట్‌పల్లి,మే7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చిన రైతులనుంచి పైసలు తీసుకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఇలాత్రిపాఠి హెచ్చరించారు. ప్రతీ బస్తాకు రూ.4 చొప్పున తీసుకుంటున్నారని రైతులు ఆమె దృష్టికి తేగా కలెక్టర్ పై విధంగా స్పందించారు. నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం తేమను స్వయంగా ఆమె పరిశీలించారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా కాంటా వేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. లారీలు సకాలంలో రాని కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందని రైతులు ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ కేంద్రానికి ఏయే తేదీన లారీలు వచ్చాయని అడిగారు. ఈ నెల 2, 5 తేదీల్లో లారీలు వచ్చాయని చెప్పారు. కానీ రికార్డులో నమోదు చేయకపోవడం పట్ల కేంద్రం నిర్వాహకుల పట్ల కలెక్టర్ ఆగ్రహం చెందారు. కార్యక్రమంలో డీఎస్‌వో హరీశ్, నల్లగొండ ఆర్డీవో యానాల అశోకొరెడ్డి, డీసీవో పాత్యానాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏపీఎం శ్రీదేవి, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.

**వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి**

శాలిగౌరారం: జిల్లాలో వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. శాలిగౌరారం మండలం రామగిరి శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేశారు. మిల్లులకు పంపించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను తనిఖీ చేయగా, ఆ బస్తాలలో తాలు, తరుగు ఉండడంపై సెంటర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్ ఇన్‌చార్జి నిమ్మల కృష్ణమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక షో కాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, ఆర్డీవో యానాల అశోక్ రెడ్డి, డీసీవో పత్యా నాయక్, తహసీల్దార్ యాదగిరి పాల్గొన్నారు.

**భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం**

నకిరేకల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో సాదాబైనామా, పీవోటీ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. నకిరేకల్ మండలాన్ని పైలెట్ మండలంగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. రైతులు సమస్యలుంటే గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో వై.అశోకొరెడ్డి, తహసీల్దార్ జమీరొద్దిన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై పోరుకు సంపూర్ణ మద్దతు

**ఎంపీ రఘువీర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై పోరుకు సంపూర్ణ మద్దతి ఇస్తున్నామని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, దేశ రక్షణ, సమైక్యత, సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు భారత పౌరుడిగా సంపూర్ణ మద్దతి ఇస్తున్నానన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం మనసును కలిచి వేసిందన్నారు. ఉగ్రదాడికి దీటుగా జవాబిచ్చేందుకు భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్తాన్‌లోని ఉగ్రవాదస్థావరాలను ధ్వంసం చేయడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1971లో తూర్పు పాకిస్తాన్‌ను స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. ఆపరేషన్ సింధూర్‌తో విచ్ఛిన్నకర శక్తులకు గట్టిగా బుద్ధి చెప్పినట్టు అయిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే ఆలేరు వెంకటేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రూ.30లక్షలు మంజూరు చేయాలి

**కలెక్టర్‌కు లేఖ రాసిన ఎంపీ చామల**

శాలిగౌరారం,మే 7(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఊట్కూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.30లక్షల నిధులు మం జూరు చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ ఇ లా త్రిపాఠికి లేఖ రాశారు. ఊట్కూరు గ్రామంలో తాగు నీటి కోసం ప్రజ లు అల్లాడుతున్నారని, భూభారతి చట్టం అవగాహన సదస్సులో గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారని, వెంటనే వారి దాహార్తిని తీ ర్చేందుకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30లక్షలు కేటాయించాలని కోరారు.

# ఉపాధి ముమ్మరం.. సౌకర్యాలు మృగ్యం



యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో మండుటెండల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆంధ్రజ్యోతి విజిట్

- వేసవిలో తల్లడిల్లుతున్న కూలీలు
- తాగునీరు, టెంట్ సౌకర్యాలు కరువు
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు
- అప్పుడప్పుడు ఓఆర్ఎస్

వేసవి కావడంతో ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. సామాన్యులు బయటికి రావడం లేదు. ఇలాంటి తరుణంలో ఎర్రటి ఎండలో పనిచేసే కూలీల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఎండల్లో పనులు చేపట్టేందుకు ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీల కోసం కనీస వసతుల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకునే వారే కరువయ్యారు. తాగునీరు, సేదతీరేందుకు టెంట్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి. కానీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే నామమాత్రంగా తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య కూలీలు పనులు వెళ్లదీస్తున్నారు.

(ఆలేరు రూరల్ / ఆత్మకూరు(ఎం) / భువనగిరి రూరల్ / బొమ్మలరామారం / మోత్కూరు / రాజాపేట )

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపాధిహామీ పనిప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. వేసవిలో సేద తీరేందుకు టెంట్ సౌకర్యం కల్పించడంలేదు. దీంతో కూలీలు చెట్ల నీడనే ఉపశమనం పొందుతున్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. వేసవిలో వడదెబ్బ నుంచి ఉపశమనం కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం లేదు. ఆత్మకూరు(ఎం) మండలంలో 23 పంచాయతీల పరిధిలో రోజూ 1,500 మంది పనులకు హాజరవుతున్నారు. గతంలో వచ్చే అలవెన్సు రావడంలేదని ఏపీవో రమేష్ తెలిపారు. భువనగిరి మండలంలో 33 పంచాయతీల్లో 17,444 మంది కూలీలున్నారు. ఎండతీవ్రతతో ప్రతి రోజూ సగటున 2,140మంది కూలీలు హాజరవుతున్నారు. రోజు వారి కూలీ రూ.307లకు గాను వేసవి తీవ్రత దృష్ట్యా కొలతల ప్రకారం సగటు రూ.234 పనులు మాత్రమే అందుతుందని కూలీలు తెలిపారు. బొమ్మలరామారం మండలంలో వారానికి ఒకసారి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నారు. రోజువారి కూలీ రూ.290 వరకు అందుతుందని కూలీలు తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలో కొన్ని గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో కూలీలు ఇంటి నుంచే నీటి నీటిని తెచ్చుకుంటున్నారు. మోత్కూరు మండలంలో 10 గ్రామ పంచాయతీల్లో రోజూ సుమారు 700 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. రాజాపేట మండలంలో కొన్నిచోట్ల మంచినీటిని, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఏర్పాటుచేశారు. యాదగిరిగుట్ట మండలంలో 23 గ్రామపంచాయతీల్లో సుమారు 1,400 మంది కూలీలు పనులు చేస్తున్నారు.

### వారానికి ఒక గ్రూప్‌కు ఉపాధి

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలంలో ఉపాధి హామీ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. దేవలమ్మనాగారంలో 150 మంది కుటుంబాలకు ఉపాధి జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతి రోజూ 50మంది కూలీలు పని చేస్తున్నారు. వారానికి ఒక గ్రూప్ చొప్పున పనులు చేయిస్తున్నారు. ఒక్క గ్రూప్‌కు పనికి లభించాలంటే నాలుగు వారాలు పడుతోంది. ఇదే పరిస్థితి చిన్నకొండూరు, పంతంగితో పాలు పలు గ్రామాల్లో నెలకొంది. అంతేకాకుండా 100 రోజుల పనిదినాలు కల్పించాల్సి ఉండగా 50 రోజులు కూడా పని దొరకడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. అరకొర వసతుల నడుమ ఉపాధి పనులు కొనసాగిస్తున్నారు.

### నల్లగొండ జిల్లాలో...

కొండమల్లేపల్లి / పెద్దఅడిశర్లపల్లి / గుర్రంపోడు / చింతపల్లి / డిండి / నార్కట్‌పల్లి / దేవరకొండ / మాడ్గులపల్లి / త్రిపురారం / వేములపల్లి / నకిరేకల్ / తిప్పర్తి /చిట్యాల రూరల్ / శాలిగౌరారం )

నల్లగొండ జిల్లాలో వేసవిలో అరకొర వసతుల మధ్య ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వేసవిలో ఎండ నుంచి రక్షణకు టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు వసతులు కల్పించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. ఇంటి నుంచి కూలీలే నీటిని తెచ్చుకుంటున్నారు. ఉమ్మడి పీఏపల్లి మండలంలో 36 పంచాయతీలుండగా 14,500 జాబ్‌కార్డులు ఉన్నాయి. గుర్రంపోడు మండలంలో రెండేళ్ల క్రితం ఉపాధి కూలీలు సేదతీరేందుకు టార్పాలిన్ కవర్లు ఇవ్వగా, అవి దెబ్బతినడతో కూలీలకు నీడ కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రెండు రోజులకు ఒకసారి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నట్లు కూలీలు తెలిపారు. చింతపల్లి మండలంలో 2,850 మంది పనిచేస్తున్నారు. ఏ గ్రామంలోనూ కనీస సౌకర్యాలు కల్పించలేదు. డిండి మండలంలోనూ అదే పరిస్థితి నెలకొంది. నార్కట్‌పల్లి మండలంలో మంచినీటిని మాత్రం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచారు. దేవరకొండ మండలంలో 39 పంచాయతీల్లో 12,674 మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. మాడ్గులపల్లి మండలంలో ఒక్కో కూలీకి రూ.100 నుంచి రూ.200 వరకు రోజువారి వేతనం చెల్లిస్తున్నట్లు కూలీలు తెలిపారు. కేతేపల్లి మండలంలో ఉపాధి కూలీలకు వసతులు కరువయ్యాయి. ఎర్రటి ఎండలో పని చేస్తున్నా కూలి డబ్బులు సకాలంలో జమ కావడం లేదని కూలీలు తెలిపారు. త్రిపురారం మండలంలో 32 గ్రామాల్లో ప్రతి రోజూ 3,800 నుంచి 4,000 మంది పనులకు వెళ్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకున్నా పనులు చేస్తున్నా సమయానికి డబ్బులు అందడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు. వేములపల్లి మండలంలో 12 గ్రామపంచాయతీల పరిధిలో 5,164జాబ్‌కార్డులు ఉండగా 9,207 మంది కూలీలు ఉన్నారు. ప్రతిరోజూ 1,650మంది కూలీలు పనికి హాజరవుతున్నారు. ఎక్కడా వసతులు కల్పించలేదు. నకిరేకల్ మండలంలో తాగునీటిని కూలీలే సొంతంగానే తీసుకెళ్తున్నారు. లోతైన కాల్వలో దిగి పనులు చేస్తున్నా అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోతున్నారు. ఆరు వారాలుగా కూలి డబ్బులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిప్పర్తి మండలంలో 26 గ్రామపంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో రోజు కూలి రూ.307కు రూ.90 నుంచి రూ.150 వరకు మాత్రమే జమవుతున్నట్లు పలువురు కూలీలు ఆరోపిస్తున్నారు. చిట్యాల మండలంలో వారం, 10రోజులకు ఒకసారి ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇస్తున్నారు. ఫస్ట్‌ఎయిడ్ కిట్‌లు అందుబాటులో లేవు. శాలిగౌరారం మండలంలో ఉపాధి కూలీలకు ఎటువంటి ఏర్పాటు కల్పించడంలేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఫీల్డ్ అసిస్టెంట్లు అందజేస్తున్నారు.

### వడదెబ్బతో ఉపాధికూలీ మృతి



సునీత(ఫైల్ ఫొటో)

గుర్రంపోడు, మే 7(ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పిట్టలగూడెం వడదెబ్బకు గురై ఉపాధి మహిళా కూలీ బుధవారం మృతి చెం దింది. గ్రామానికి చెందిన పాల్వాయి సునీత(50) రోజూ మాదిరిగానే బుధవానం ఉపాధి పనికి వెళ్లింది. పనిచేస్తూనే కుప్పకూలింది. గమనించిన తోటి కూలీలు 108 వాహనంలో నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందింది. ఎండలకు వడదెబ్బతో అనారోగ్యానికి గురై మృతి ఆసుపత్రి నిర్వాహకులు ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### ఉపాధి కూలీలకు పేస్లిప్స్ అందించాలి



ఉపాధి కూలీలకు ప్రభుత్వం పేస్లిప్‌లు ఇవ్వకపోవడం వల్ల చేసిన పనికి తగిన కూలీ అందుతుందా లేదా అనేది అర్థం కావడంలేదు. ఎండను సైతం లెక్కచేయకుండా పనులకు వెళితే సకాలంలో కూలి డబ్బులు రాకా తీవ్రఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశాల్లో వేసవిలో టెంటు, మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాల్సి ఉన్నా ఆచరణలో అమలు కావడంలేదు. కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి.

- సిర్పంగి స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, వలిగొండ

### పంచాయతీ వారిదే బాధ్యత



కనగల్ మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రికార్డు స్థాయిలో కూలీలు పనులకు హాజరవుతున్నారు. వ్యవసాయ అభివృద్ధి పనులతో పాటు రోడ్లు, పంట కాల్వ మరమ్మతు పనులు చేపట్టాం. పని ప్రదేశాల్లో నీడ, తాగు నీటి వసతిని కల్పించటం పంచాయతీ వారిదే బాధ్యత.

- సుధాకర్, ఏపీవో, కనగల్ మండలం

### సూర్యాపేట జిల్లాలో ...

మేళ్లచెర్వు: మేళ్లచెర్వు ఉమ్మడి మండల వ్యాప్తంగా మొక్కుబడిగా నత్తనడకన ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. గతంలో చేసిన పనికి పూర్తిస్థాయిలో కూలి చెల్లించలేదని కూలీలు వాపోతున్నారు. వ్యవసాయ భూముల్లో నాసిరకం పనులు చేస్తున్నారని రైతులు తమ పొలం పనులను ఉపాధి కింద నమోదు చేయకపోవడంతో నామమాత్రపు పనులు మాత్రమే లభిస్తున్నాయి. కాగా పని ప్రదేశాల్లో ఎటువంటి టెంట్లు ఏర్పాటుచేయలేదు. కొన్నిచోట్ల మాత్రమే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. తాగునీటిని కూలీలే తెచ్చుకుంటున్నారు. ఫస్ట్‌ఎయిడ్స్ కిట్స్ పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు.

పెన్‌పహాడ్ : అరకొర వసతుల మధ్య ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో చెట్ల నీడలే దిక్కయ్యాయి. కొన్నిచోట్ల చాలీచాలని టెంట్లు ఏర్పాటుచేశారు. చాలాచోట్ల కూలీలు ఇంటి నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్‌కిట్లు అందుబాటులో లేవు.

### వసతులతో పాటు ప్రోత్సాహాలకు కోత

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు): ఉపాధిహామీ పథకంలో కూలీలకు సౌకర్యాలతో పాటు ప్రోత్సాహకాలూ కోతకు గురవుతున్నాయి. ఎండలో పనిచేసే కూలీలు అలసిపోతే సేద తీరేందుకు గతంలో పనిప్రదేశంలో టెంట్లు వేసేవారు. కూలీలకు రోజుకు లీటరుకు రూ.2 చొప్పున ఐదు లీటర్లకు రూ.10, ప్రాథమిక చికిత్స కిట్టు తీసుకెళ్లడానికి రూ.10, గడ్డపారలు, పారలు, తట్టలు లాంటి పనిముట్లు, గడ్డపారలు మొన పెట్టించడానికి రూ.10 చొప్పున ఇచ్చేవారు. వేసవి భత్యం కింద ఫిబ్రవరి, మార్చి నెలల్లో 20 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20శాతం కూలి అదనంగా ఇచ్చేవారు. రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ నుంచి కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌కు మారాక అవన్నీ రద్దయ్యాయి. 2023లో రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ రాగాస్ నుంచి కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ ఎన్ఐసీ(నేషనల్ ఇన్ ఫర్మేటివ్ సిస్టమ్)కు మారింది. ఇప్పుడు అన్ని బాధ్యతలు గ్రామపంచాయతీలకు అప్పగించారు. అయితే నిధుల్లేక, ప్రజాప్రతినిధులు లేక టెంట్లు, మంచి నీరు లాంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలేదు. పంచాయతీల్లో ప్రాథమిక చికిత్స కిట్లు ఉంచుతున్నారు. అందులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కాటన్, టించర్ ఆఫ్ అయోడిన్ ఉంటుంది. పనిప్రదేశంలో ఎవరైనా గాయపడితే ఫీల్డ్‌అసిస్టెంట్ ఆ కిట్టు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందిస్తారంటున్నారు. ఇదిలా ఉండగా ఎన్ఐసీకి మారాక కూలీలు గాయపడితే చికిత్సకయ్యే ఖర్చు(మెడికల్ రీయింబర్స్‌మెంట్), పని ప్రదేశం గ్రామం నుంచి ఐదు కిలోమీటర్లు, ఆపైన దూరం ఉంటే పోవడానికి రూ.5, రావడానికి రూ.5 చొప్పున రోజుకు రూ.10 రవాణాభత్యం కింద చెల్లిస్తూ మిగతా ప్రోత్సాహకాలన్నింటికీ మంగళం పాడేశారు. గతంలో మాదిరిగా ఇప్పుడు ఉపాధి కూలీలకు ప్రోత్సాహకాలు లేవు.

### సేద తీరేందుకు ఇబ్బంది పడుతున్నాం



వేసవిలో ఎండ నుంచి సేదతీరేందుకు కనీసం టెంట్ సౌకర్యం కల్పించలేదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నా, మెడికల్ కిట్లు లేవు.

- ఎల్లమ్మ ఉపాధి కూలీ, మాసాయిపేట, యాదగిరిగుట్ట మండలం

### కూలీలకు పనిముట్లు అందజేయాలి



పనులు చేయడానికి తప్పనిసరిగా పనిముట్లను ఇప్పించాలి. మా వద్ద పని ముట్లు లేకపోవడంతో పనులు చేయలేకపోతున్నాం. ముఖ్యంగా తట్టలు, పారలు, గొడ్డళ్లు, గునపం తదితర పనిముట్లను ప్రభుత్వం కూలీలకు అందించాలి.

- గంట శైలజ, ఉపాధి కూలీ, శాలిగౌరారం

### ఎండలో పనిచేస్తున్నాం సౌకర్యాలు కల్పించాలి



రోజూ ఎండలో పనిచేస్తున్నాం. కూలీలకు టెంట్, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యా కెట్‌లు ఏర్పాట్లు చేయాలి. ఆరు వారాలుగా కూలి డబ్బులు పడటంలేదు. రోజుకు రూ.150 కూడా గిట్టుబాటు కావడం లేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

- బొల్లం రాములమ్మ, పాలెం, నకిరేకల్

### పని ప్రదేశంలో నీడ వసతిని కల్పించాలి



ఎండల తీవ్రత పెరిగి ఉపాధి పనికి వస్తున్న పలువురు కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీటి వసతిని టెంటు సౌకర్యం కల్పించాలి.

- పెరిక సునీత, తిమ్మాజిగూడెం గ్రామం, కనగల్

### పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి



వేసవి దృష్ట్యా పనిచేసే చోట టెంట్, మంచినీటి సౌకర్యం కల్పించాలి. కంప చెట్ల కిందనే సేద తీరుతున్నాం. ఇంటి నుంచే బాటిళ్ల ద్వారా మంచినీటిని తెచ్చుకుంటున్నాం. ఈ విషయమై అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు చూడాలి.

- కోట పద్మ, ఉపాధి కూలీ, వడాయిగూడెం

### మంచినీటిని మేమే తెచ్చుకుంటున్నాం



ఉపాధి పనులను ప్రారంభించిన నాటి నుంచి మేమే ఇంటి నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నాం. పనిచేసే ప్రాంతంలో తమకు ఇప్పటివరకు మంచినీటిని ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా వేసవి దృష్ట్యా మంచినీరు అందించాలి.

- చేప కొండలు, దోరకుంట

### తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం



తాగునీటిని ఏర్పాటుచేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం. వేసవి కావడంతో దాహార్తి వేస్తోంది. టెంట్ సౌకర్యం కల్పించాలి.

- పాకాల జయమ్మ, కూలీ, ఉరుమడ్ల, చిట్యాల.

### ● రికార్డు స్థాయిలో కూలీల హాజరు



కనగల్ : ఉపాధిహామీ పథకం పనులు కనగల్ మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సందర్భంలో కూలీలు ఉపాధి పనులకు వెళ్తూ సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి రోజూ 4 వేల మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. రోజువారి వేతనం కొలతల ప్రకారం రూ.307 చెల్లించవల్సి ఉండగా సరాసరి ఒక్కో కూలీకి రూ.260 వరకు అందుతోంది. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండకుండా ఉన్నత విద్యాభ్యాసం చేసే వారు కూడా కూలీలతో కలిసి పనులకు హాజరవుతున్నారు. తల్లిదండ్రులకు ఎంతోకొంత ఆసరాగా ఉంటున్నారు. అయితే మండుటెడల్లో పనిచేసే కూలీలకు పని ప్రదేశాల్లో కల్పించాల్సిన కనీస వసతులు కల్పించడం లేదు. టెంట్ సౌకర్యం లేక ఎండల తాకిడికి కూలీలు తరుచూ వడదెబ్బకు లోనవుతున్నారు.

### ● కోతలు ముగియడంతో ఉపాధి పనులకు

కోదాడ రూరల్ : కోదాడ మండలంలో ఏప్రిల్ నెల నుంచి ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు కింద వరికోతలు పూర్తవడంతో కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ప్రతీ గ్రామంలో 20 నుంచి 30 గ్రూపులు పనులు నిర్వహిస్తున్నాయి. వేసవి కావడం వల్ల మధ్యాహ్నం లోపు పనులు పూర్తిచేస్తున్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు అందించాల్సిన మంచినీటి సరఫరా, టెంట్లు ఏఒక్క గ్రామంలోనూ ఏర్పాటు చేయలేదు. మంచినీటిని కూలీలే ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. మూడు నెలల కిందట పనులు పూర్తి చేసినా ఇంతవరకు బిల్లులు రాలేదని నల్లబండగూడెం గ్రామానికి చెందిన కూలీలు తెలిపారు. డబ్బుల కోసం పోస్టాఫీసు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు.



కాల్వ పనుల్లో ఉపాధి కూలీలు

## ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా బదిలీ



వికాస్ భాటియా

బీబీనగర్, మే 7 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్‌లోని అఖిల భారత వైద్య, విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) డైరెక్టర్ వికాస్ భాటియా బదిలీ అయ్యారు. ఆయన మాతృ సంస్థ ఒడిసాలోని భువనేశ్వర్ ఎయిమ్స్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు బీబీనగర్ ఎయిమ్స్‌లోని ప్రధాన విభాగ అధిపతులు ఇతర వైద్య సిబ్బంది భాటియాకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ అహన్‌తెమ్ శాంతా సింగ్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

## రేపు సబ్ జూనియర్ నెట్‌బాల్ జట్ల ఎంపిక

నాగార్జునసాగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల నెట్‌బాల్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికకు హాజరయ్యే బాల, బాలికలు 16 ఏళ్లలోపు వయస్సు వారై ఉండాలన్నారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు రావాలన్నారు. పూర్తి వివరాలకు 9160494743 అనే నెంబరులో సంప్రదించాలని సూచించారు.

## పశుపోషకులకు వరప్రదాయిని సురభి చియాన్ శ్రఖ్ల

కోదాడ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు సురబి చియాన్ శ్రఖ్ల పథకం వరప్రదాయిని కానుందని జిల్లా పశువైద్య, పశుసంవర్థక అధికారి డాక్టర్ దాచేపల్లి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సురబి చియాన్ శ్రఖ్ల పథకంలో భాగంగా పశువుల గుర్తింపు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పథకం విశేషాలను వివరించారు. దేశంలో 10 లీటర్ల నుంచి 15 లీటర్ల పాలిచ్చే పశువులను గుర్తించి వాటి జాతి, వయస్సు, ఈతలు, రోజువారీ పాల దిగుబడి, వాటి తల్లి, తండ్రి వివరాలు, మేత అలవాట్లు యజమాని వివరాలను భారత్ పశుదాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. అలా సేకరించిన అత్యుత్తమ పశువుల యాజమాన్యం, సంరక్షణ,పోషకులకు చేయూత అందించే పథక రూపకల్పనకు ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 10 లీటర్లపైన పాలిచ్చే అన్నిపశువుల వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. పశుపోషకులు ఆ పశువుల వివరాలను తమ పరిధిలోని పశువైద్యాధికారులను సంప్రదించి నమోదు చేయించుకోవాలని సూచించారు. కోదాడ పరిసర ప్రాంతాల్లో 18లీటర్ల వరకు పాలిచ్చేవి రూ.1.5 లక్షలు, రూ.2.5 లక్షల విలువైన గేదెలు ఉన్నాయని, వాటి పోషణలో శాస్త్రీయత పాటిస్తూ అధికలాభాలు పొందాలంటే వీరికి ఒక శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని ప్రాంతీయ పశువైద్యశాలఅసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య ప్రతిపాదించారన్నారు. ఇందుకు అనుమతిస్తూ కావాల్సిన సౌకర్యాల ఏర్పాటుకి చేయూతిస్తామన్నారు. రైతులను గుర్తించి త్వరలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆరో విడత సామూహిక గాలికుంటు నివారణ కార్యక్రమంలో భాగంగా 30 గేదెలు, 15 ఆవులతో డెయిరీ ఫాం నిర్వహిస్తున్న షేక్ ఉస్మాన్ ఫారాన్ని సందర్శించారు. గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. టీకా కార్యక్రమాన్ని ఈ నెల 14వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. పశువులన్నింటికీ టీకా అందించి జిల్లాలో గాలికుంటు వ్యాధి ఆనవాళ్లు లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, సాగర్ తదితరులు పాల్గొన్నారు



పశువుల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

## కేజీబీవీ విద్యార్థినికి విమాన ప్రయాణం

- 10/10 జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం చేయిస్తానని గతంలో హామీపత్రం
- హామీ నిలబెట్టుకున్న నల్లగొండ జిల్లా కలెక్టర్

మాడ్గులపల్లి/ నల్లగొండ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం చేయిస్తానని కేజీబీవీ విద్యార్థినులకు ఇచ్చిన మాటను నల్లగొండ జిల్లా కలెక్టర్ నిలబెట్టుకున్నారు. కేజీబీవీలో జిల్లాలో మొదటి స్థానం సాధించిన మాడ్గులపల్లికి చెందిన విద్యార్థిని ప్రసన్న కలను కలెక్టర్ ఇలాత్రిపాఠి నెరవేర్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన కలెక్టర్ ఇలాత్రిపాఠి కనగల్ మండలంలోని కేజీబీవీని సందర్శించిన సమయంలో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించే కేజీబీవీ విద్యార్థినులను తన సొంత ఖర్చులతో విమాన ప్రయాణం చేయిస్తానని హామీపత్రం రాసి ఇచ్చారు. మాడ్గులపల్లికి చెందిన విద్యార్థిని పుట్ల ప్రసన్న 563 మార్కులు సాధించగా, ఇచ్చిన మాట ప్రకారం విమాన ప్రయాణ టికెట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం తన ఛాంబర్‌లో విద్యార్థినికి అందించారు. విద్యార్థిని ప్రసన్న, మాడ్గులపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కె.సునీత ఈ నెల 17న హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు విమానంలో వెళ్లి 19వ తేదీన హైదరాబాద్‌కు రానున్నారు. విమాన ప్రయాణ చార్జీలతోపాటు విశాఖపట్టణంలో అక్కడ వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కలెక్టర్ తన సొంత ఖర్చులతో కల్పిస్తున్నారు. ఆడ పిల్లలను చదువుకోవాలని ప్రోత్సహించడమే కాకుండా సొంత ఖర్చుతో విమాన ప్రయాణం అవకాశం కల్పించి విశాఖపట్టణం పంపిస్తున్నందుకు విద్యార్థిని ప్రసన్న, కేజీబీవీ ప్రత్యేక అధికారి కె.సునీత జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఈవో భిక్షపతి తదితరులు ఉన్నారు.



కేజీబీవీ విద్యార్థిని ప్రసన్నను అభినందిస్తూ హైదరాబాద్- విశాఖపట్టణం విమాన ప్రయాణం టికెట్ అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## పనుల్లో హాజరు రికార్డుల్లో రిజెక్ట్

చిట్యాల రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి ఉపాధిహామీ పనులు చేసిన కూలీలకు వింత సమస్య ఎదురైంది. పనులు చేసినా రికార్డుల్లో రిజెక్ట్‌గా వస్తోంది. కూలీలు తెలిపిన వివరాల ప్రకారం పెద్దకాపర్తి గ్రామంలో నీలకంఠం కావ్య, ఆమనగంటి శైలజ, ఏర్పుల భాగ్య, బత్తుల లక్ష్మమ్మలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. రోజూ అందరితో కలిసి 60 రోజులుగా పనిచేస్తున్నారు. స్థానిక సిబ్బందిని చేసిన పనికి డబ్బులివ్వమని అడగడంతో పరిశీలించి ఇస్తానన్నారు. బుధవారం మరోమారు డబ్బులు అడిగితే మీపేర్లు కంప్యూటర్‌లో రిజెక్ట్ వస్తుందని సమాధానమిచ్చారు. దీంతో బాధితులు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి ఆరా తీశారు. ఈ విషయాన్ని ఇది వరకే స్థానిక సిబ్బందికి తెలియజెప్పామని వారు వివరించారు. ప్రస్తుతం 60 రోజులే కాకుండా ఇదివరకు సుమారు 20రోజులు కూడా తాము కూలీ పనికి వెళ్లామని బాధితులు తెలిపారు. చేసిన పనికి కూలి అందడం లేదని వాపోయారు. ఈ విషయమై ఎంపీడీవో జయలక్ష్మిని వివరణ కోరగా తనకు విషయం తెలియదని సిబ్బందిని అడిగి తెలుసుకుని తప్పనిసరిగా పరిశీలిస్తామని బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

### డబుల్ జాబ్‌కార్డులున్నాయి : ఏపీవో శ్రీలత

కూలీలు పనులకు వస్తున్నారు, సంతకాలు చేస్తున్నారని, వారి పేరిట, కుటుంబ పరంగా డబుల్ జాబ్‌కార్డులున్నాయని ఏపీవో శ్రీలత తెలిపారు. రెండుసార్లు ఒకే పేరు ఒకే ఆధార్ ఉండటంతో కంప్యూటర్‌లో రిజెక్టుగా చూపిస్తుందన్నారు. సమస్యను జిల్లా అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు.

## యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, మే7(ఆంధ్రజ్యోతి) :యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్టామూర్తులను అభిషేకించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలి పూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు చేపట్టారు.. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 17,85,706 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

### సంప్రదాయ బద్ధంగా లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మట్టపల్లిలోని రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు సంప్రదాయబద్ధంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం ఆర్జిత కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం హోమాధికాలు భక్తిశ్రద్ధలతో చేశారు. తదుపరి కల్యాణమూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేం చేయించి పుణ్యాహవాచనం కావించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యథావిధిగా చేపట్టారు. మంగల్యాధారణ అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో పండితులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఆవేదన

తాము దాచుకున్న సొమ్ము (డబ్బు) కోసం రిటైర్డ్ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2024 జనవరి నుంచి 2025 ఏప్రిల్ వరకు 1,037మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్ అయ్యారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం కొందరు, ఇళ్లు కట్టుకొని, కొనుక్కొని ప్రశాంతంగా జీవించాలని మరి కొందరు జీపీఎఫ్, సరెండర్, ఎన్‌క్యాష్‌మెంట్ లీవులు, గ్రాట్యూటీ రూపంలో డబ్బులు దాచుకున్నారు. ఆ డబ్బులు చేతికి అందకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా సీనియారిటీ ప్రాతిపదికన బెనిఫిట్స్ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి- కోదాడ



- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూపులు
- ఒక్కొక్కరికీ రూ50నుంచి 70లక్షల వరకు బకాయిలు
- సంవత్సరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,037మంది రిటైర్డ్
- ఇప్పటికీ అందని ప్రయోజన బకాయిలు

నేను ఆర్అండ్‌బీలో 44 సంవత్సరాలుగా, పనిచేసి జూన్ 2024లో కోదాడ లో రిటైర్ అయ్యా. రిటైర్ బెనిఫిట్స్ రూ.50లక్షల వరకు రావాల్సి ఉంది. ఇంటి కోసం రు ణం తీసుకున్నా. నాకు వచ్చే జీతం రూ.60వేలు, అందులో నుంచి రుణం కింద రూ.44వేలు పోతుంది. మిగిలిన రూ.16వేలతో కుటుంబం గడపాల్సి వస్తోంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేశా. అబ్బాయి ఉన్నాడు, జాబ్ లేదు. మాపైనే ఆధారపడతాడు. భార్యకు బీపీ, షుగర్ ఉంది. నాకు మోకాళ్ల నొప్పులు. బెనిఫిట్స్ వస్తే చూపించుకుందామనుకుంటే రావడంలేదు. మా డబ్బులకు కూడా ఎదురుచూడాల్సి వస్తోంది. ఇదెక్కడి న్యాయమో అర్థం కావడం లేదు.

- కె. రమేష్, ఆర్అండ్‌బీ రిటైర్డ్ ఉద్యోగి.

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్వీసు (30-40 సంవత్సరాలు) వరకు ఉంటుంది. ఆ క్రమంలో పిల్లల చదువుల, పెళ్లిళ్ల కోసం కొందరు, ఇళ్లు కట్టుకొని, కొనుక్కొని ప్రశాంతంగా జీవించాలని మరి కొందరు జీపీఎఫ్, సరెండర్, ఎన్‌క్యాష్‌మెంట్ లీవులు, గ్రాట్యూటీ రూపంలో డబ్బులు దాచుకుంటారు. అన్ని కలిపి ఒక్కొక్కరికి రూ.50నుంచిరూ. 70లక్షల వరకు దాచుకున్న డబ్బులను రిటైర్మెంట్ అయిన నెలకు లేదంటే రెండు నెలల్లో ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. సంవత్సరం దాటినా తాము దాచుకున్న డబ్బులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో రిటైర్ అయిన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము దాచుకున్న డబ్బు కోసం నిరసన తెలపాల్సి రావడం బాధాకరమని పేర్కొంటున్నారు. దాచుకున్న డబ్బులు అవసరానికి వస్తాయని ఆశపడ్డామని తెలిపారు.

### నిరసనలు చేయాల్సిరావడం బాధాకరం : మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

2021నుంచి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఇబ్బందులు రిటైర్ అయిన వారు ఇబ్బందులు పడాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. సకాలంలో బెనిఫిట్స్ ఇవ్వాలని గతంలో శాసనమండలిలో మాట్లాడినట్లు 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. ఏప్రిల్ నెలలో ఇందిరా పార్కు వద్ద రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం పెన్షనర్లు సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని, బెనిఫిట్స్ కోసం డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

### రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తే ఇబ్బందులు ఉండవు

నేను సూర్యాపేట జిల్లా కోదాడ మండలం తమ్మరహైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి 2024 మేలో రిటైర్డ్ అయ్యా. ఉద్యోగ విరమణ చేసి సంవత్సరం అయినా నేటికీ రిటైర్మెంట్ ప్రయోజనాలు అందలేదు. రిటైర్‌కు ముందు జీతం లక్ష వచ్చేది. ఇంటి కోసం రుణం తీసుకున్నాను. రుణం కింది రూ.40 వేలు కట్ అయ్యేది. రిటైర్ అయ్యాక జీతం రూ.50వేలు వస్తోంది. లోన్ కింద రూ.40వేలు పోతే, మిగిలేది రూ.10 వేలు. వాటితో కుటుంబం ఎలా గడవాలి. అంతేకాక వయస్సు రీత్యా ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఆస్పత్రికి వెళ్లలన్నా డబ్బులు ఉండడం లేదు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తే ఇబ్బందులు ఉండవు. దాచుకున్న డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

- చుండూరు ప్రసాద్, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్.

### అప్పు ఇచ్చినవారు అడుగుతున్నారు

నేను సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం యతిరాజపురం తండాలో ఎస్జీటీగా పనిచేసి గతేడాది రిటైర్ అయ్యా. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తాయనే ఆలోచనతో, ఫిబ్రవరిలో పాప పెళ్లి చేశా. సంవత్సరం గడుస్తున్నా బెనిఫిట్స్ రాకపోవడం, పెళ్లి కోసం అప్పులు, కొన్ని డబ్బులు చే బదులు తెచ్చా. అప్పు ఇచ్చినవారు అడుగుతున్నారు. దీంతో ఇబ్బందులు పడుతున్న. డబ్బులు ఇవ్వలేక మానసిక క్షోభ అనుభవించాల్సి వస్తోంది.

- సంకతాల గోవిందరావు, రిటైర్డ్ ఎస్జీటీ.

### అప్పులు తెచ్చి అమ్మాయిల పెళ్లిళ్లు చేశా

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంటలో హైస్కూల్‌లో ఎస్జీటీగా పనిచేస్తూ ఆగస్టు 2024లో రిటైర్ అయ్యా. 50లక్షల వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రావాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిల కోసం అప్పులు తెచ్చా. అంతేకాక వారికి కొంత డబ్బులు ఇవ్వాల్సి ఉంది. బెనిఫిట్స్ అందకపోవడంతో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోతున్నాను.

- తెల్లకూల నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎస్జీటీ.

# చెరువులను తవ్వేస్తున్నారు

- యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు
- సమాచారమిచ్చినా పట్టించుకోని అధికారులు



గంగన్నపాలెం చెరువు కుంటలో లారీలోకి మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

తిప్పర్తి, మే 7 (ఆంధ్రజ్యోతి): చెరువులను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అక్రమంగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కుంటలు, చెరువులు ధ్వంసమవుతూనే ఉన్నాయి. చెరువు కుంటల్లో ఉన్న మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెంలోని తిప్పలమ్మకుంటలో, గంగన్నపాలెం గ్రామంలోని మరో చెరువు కుంటలో రెండు రోజులుగా అక్రమంగా మట్టిని తరలిస్తూనే ఉన్నారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు ఎంపీడీవోకు సమాచారం ఇచ్చారు. ఆయన సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం ఇచ్చారు. ఐబీ అధికారులు మాత్రం తమకు విషయం తెలియదని, ఇప్పుడే పనులు ఆపిస్తానని చెప్పారని, అయినా రోజంతా మట్టి తరలిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

### నిబంధనలకు తూట్లు..

ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల వంటి వాటిల్లో రైతులు పొలాల్లోకి తీసుకెళ్లే విధంగా ప్రభుత్వం వెసులుబాటు కల్పించినప్పటికీ నిబంధనలు పక్కన పెట్టి ఇష్టానుసారంగా మట్టి తరలిస్తున్నారు. భూమిపై నుంచి రెండు ఫీట్లలోతు కన్న తక్కువగానే ఒకే లెవల్‌లో మట్టిని ఎత్తాల్సి ఉంది. కానీ చెరుకు కుంటలో లారీ మునిగిపోయేంత ఎత్తులో సుమారు 10 నుంచి 12 ఫీట్ల లోతుకు తవ్వుతూ మట్టి తరలిస్తున్నారు.

### ఎవరూ పట్టించుకోరు

గ్రామస్థులు సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా మాకు తెలియదు.. ఆపేస్తామంటూ మాటలు చెబుతూ సాయంత్రం వరకు ఎవరూ పట్టించుకోలేదు. ఇలాగే మట్టి తరలింపు కొనసాగిస్తే గ్రామానికి అతి సమీపంలో ఉండడంతో పశువులు, మనుషులు కూడా ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తరలింపు విషయమై ఏఈ శివరామ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తిప్పలమ్మగూడెం గ్రామం కుంట

# నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో ఇంటి రిజిస్ట్రేషన్ ?

- బాధితురాలు ఫిర్యాదుతో వెలుగులోకి
- కలెక్టర్ ఆదేశాలతో డీఎల్‌పీవో విచారణ
- నల్లగొండ జిల్లా అక్కెనపల్లిలో ఘటన

నార్కట్‌పల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి ఓ ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. అక్కెనపల్లికి చెందిన మామిడి రాములుకు ఇదే గ్రామంలో ఓ ఇల్లు ఉంది. అతడికి భార్యా పిల్లలు లేరు. 2021లో రాములు చనిపోయాడు. ఈ సమయంలో మామిడి వెంకటమ్మ (తమ్ముడు కూతురు) హిందూ సంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలు నిర్వహించింది. అయితే రాములు మరణానంతరం అతడి పేరు మీద ఉన్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకునే విషయంలో వెంకటమ్మ, రామయ్య సోదరి పార్వతమ్మ మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో పరస్పరం అంగీకారానికి వచ్చేంత వరకు మరణ ధ్రువీకరణ పత్రం ఎవరికీ ఇవ్వొద్దని ఇరువురు గ్రామ పంచాయతీలో అప్పటి సర్పంచ్, కార్యదర్శికి విన్నవించారు. అనం తరం మామిడి పార్వతమ్మ రామయ్యకు సంబంధించిన నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని జతపర్చి నల్లగొండలో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుంది.

ఈ విషయం తెలుసుకున్న వెంకటమ్మ పంచాయతీ కార్యదర్శిని నిలదీసింది. తాము మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని చెప్పడంతో అనుమానం వచ్చి ఈసీలో పరిశీలించింది. చేతిరాతతో కూడిన మరణ ధ్రువీకరణ పత్రం ఉండటంతో ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు వెంకటమ్మ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నల్లగొండ డీఎల్‌పీవో వెంకటేశ్వర్లు మంగళవారం అక్కెనపల్లికి వచ్చి 2021 నుంచి ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శులను పిలిచి విచారించారు.

### కలెక్టర్‌కు నివేదిక ఇస్తా

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశా. 2021లో ఇక్కడ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన వెంకన్న, జానకమ్మను పిలిచి మరణ ధ్రువీకరణ పత్రం జారీ విషయమై విచారించా. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తా.

- వెంకటేశ్వర్లు, డీఎల్‌పీవో

# ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు

(5వ పేజీ తరువాయి)

భాగంగా పండ్ల తోటలతో పాటు పూల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. కొత్త పండ్ల తోటలు బొప్పాయి, అరటి, అల్లనేరడు, సీతాఫలం, మామిడి, నిమ్మ, జామ, బత్తాయితో పాటు పూల సాగుకు 40శాతం రాయితీ వర్తింపజేయనున్నారు. అదేవిధంగా వంగతోటలతో పాటు టమాట, పచ్చిమిర్చి, కూరగాయల నారు కూడా ఈ పథకం కింద రైతులకు సరఫరా చేస్తారు. పాత తోటలు అంటే మామిడి, బత్తాయి పునరుజ్జీవం కింద 40శాతం రాయితీ ఇస్తారు. పాలీ, గ్రీన్‌హౌస్ నిర్మాణం, మల్చింగ్ పద్ధతిలో సాగుకు 50శాతం రాయితీ ఇవ్వనుండగా, సమగ్ర తెగులు నివారణకు, సమీకృత పోషణ నిర్వహణకు 50శాతం రాయితీ ఇవ్వనున్నాంరు. ఉద్యాన పంటల రైతులకు ట్రాక్టరు, పవర్‌టిల్లర్, పవర్ వీడర్, రష్ కట్టర్, పవర్డ్ నాప్‌సాక్ట్ స్ప్రేయర్, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్లను కేటాయిస్తారు. అదేవిధంగా వర్మికంపోస్టు యూనిట్లకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు.

### మల్బరీ, వెదురు, తీగజాతి సాగుపై దృష్టి

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవీవై) కింద శాశ్వత పందిరి పద్ధతిలో తీగజాతి కూరగాయల సాగును ప్రోత్సహించనున్నారు. వీటికి కూడా 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 300యూనిట్లు కేటాయించారు. దీంతో పాటు రాష్ట్రీయ వెదురు మిషన్ (ఎన్‌బీఎం) కింద వెదురు మొక్కలను పెంచేందుకు ప్రోత్సాహకం అందించనున్నారు. ఎకరానికి 50శాతం రాయితీపై రూ.14,400లు రైతులకు అందజేస్తారు. దీంతోపాటు మల్బరీ తోటలను విస్తరించాలని నిర్ణయించారు. కొత్త మల్బరీ తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఎకరానికి రూ.60వేల నుంచి రూ.78వేలు, అదేవిధంగా రూ.2.25లక్షల నుంచి రూ.2.90లక్షలు రేరింగ్ షెడ్ నిర్మాణంతో పాటు క్రిమిసంహారక మందుల సరఫరా, ఉద్యాన యాంత్రీకరణ పరికరాలకు 50శాతం రాయితీ ఇవ్వనున్నారు. మల్బరీ సాగు ద్వారా పట్టు పురుగులు ఉత్పత్తి చేసే రైతులకు పట్టుగూళ్లకు కిలోకు రూ.75ను ప్రోత్సాహకంగా అందించనున్నారు. నల్లగొండతో పాటు సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో ఉద్యాన పంటలు విస్తరించేందుకు కొత్తగా రూపొందించిన ప్రణాళిక ప్రకారం అధికారులు ముందుకెళ్లనున్నారు. సూర్యాపేట జిల్లాలో 15వేల ఎకరాలలోపు పండ్ల తోటలు ఉండగా, కూరగాయల సాగు 3వేల వరకు ఉంది. ఇకపై ప్రతీ మండలంలో అదనంగా 50 ఎకరాల్లో కూరగాయల సాగు చేపట్టనున్నారు. యాదాద్రి జిల్లాలో సైతం 2025-26కు సంబంధించి ఉద్యాన పంటలు విస్తరింపచేసేలా కార్యాచరణ సిద్ధమైంది.

## చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు, జరిమానా

కట్టంగూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ ఆరీఫ్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు కట్టంగూరు ఎస్ఐ రవీందర్ తెలిపారు. గత ఏడాది అక్టోబరు 30వ తేదీన మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన పులిజాల నర్సింహ దంపతులు ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నర్సింహ ఇంటి తాళం ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు అభరణాలు, కొన్ని వెండి వస్తువులు దొంగిలించాడు. బాధితుడు నర్సిహ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బోడ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. నిందితుడైన అయిటిపాముల గ్రామానికి చెందిన నకిరేకంటి సైదులును కట్టంగూరు ఎస్ఐ రవీందర్ పట్టుకుని చోరీ చేసిన వస్తువులను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో కోర్టు నకిరేకంటి సైదులుకు ఏడాది జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు , జరిమానా

సూర్యాపేట క్రైం, మే 7, (ఆంధ్రజ్యోతి): డ్రైంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, జరిమానా విధించిరటెంల సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టు విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.సాయిరాం తెలిపారు. ఈ నెల 6న సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేసి ఆరుగురిని పట్టుకున్నామన్నారు. వీరిని సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఎదుట బధవారం హాజరుపర్చగా, ఒకరికి ఒకరోజు జైలు, రూ.1000జరిమానా, మిగిలిన ఐదుగురికి రూ.1000చొప్పన జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

## చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

- ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పేలుడు ఘటనలో నలుగురికి చేరిన మృతుల సంఖ్య



శ్రీకాంత్ (ఫైల్ )

మోటకొండూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ పేలుడు ఘటనలో మృతి చెందిన కార్మికుల సంఖ్య నాలుగుకు చేరింది. ఎస్ఐ నాగుల ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 29న జరిగిన భారీ పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడిన బర్ల శ్రీకాంత్(34) వారం రోజులుగా హైదరాబాద్‌లోని యశోధ ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. యాదగిరిగుట్ట మండలంలోని కాచారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ బతుకుదెరువు కోసం ఎనమిదేళ్లుగా ప్రీమియర్ కంపెనీలో సీనియర్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. తన కుటుంబ సభ్యులతో కొన్నేళ్లుగా ఆలేరులో స్థిరపడి అక్కడే నివాసం ఉంటున్నారు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు అక్షిత్(11), అనిష్(9) ఉన్నారు. ఈ ఘటనలో ఇప్పటికే ముగ్గురు మృతి చెందగా ఒక వ్యక్తి చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లాడు. మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గురువారం ఆలేరు మండలకేంద్రంలో అంత్యక్రియలు జరగనున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

**సూర్యాపేట జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో వ్యక్తి మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి.**

సూర్యాపేటక్రైం, కోదాడ రూరల్, తిరుమలగిరి రూరల్ మే 7, (ఆంధ్రజ్యోతి):సూర్యాపేట పట్టణ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రికి చెందిన ఎల్.సైదులు (26)ప్రైవేటు కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే పనికి వెళ్లి సూర్యాపేటకు వచ్చే సరికి రాత్రి అయింది. దీంతో ఇంటికి వెళ్లేందుకు తన మిత్రుడైన మరో కారు డ్రైవర్ వేణును సాయం కోరాడు. దీంతో వేణు బైక్‌పై ఇద్దరూ కలిసి సూర్యాపేట నుంచి పిల్లలమర్రికి వెళ్తుండగా జాతీయ రహదారిపై అంజనాపురి కాలనీ సమీపంలో అర్ధరాత్రి సమయంలో విజయవాడ వైపు నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో సైదులు అక్కడికక్కడే మృతి చెందగా, వేణుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహంతో పాటు గాయపడిన వేణును ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘువులు తెలిపారు.



సైదులు మృతదేహం


● కోదాడ మండలం అడ్లూరు కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. యర్రవరం గ్రామానికి చెందిన సూరేపల్లి గోవిందరావు యర్రవరం నుంచి కోదాడకు వస్తుండగా, ఎదురుగా వస్తున్న బైకును ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో గోవిందరావుకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్సులో కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. గోవిందరావును ఢీకొట్టిన బైక్ యజమాని పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పోలీసులు తెలిపారు.

● తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో ఎస్సీ కాలనీ పాఠశాల వద్ద రెండు బైక్‌లు ఢీ కొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకండ్ల మండలం హక్య తండాకు చెందిన గుగులోత్ యాకూబ్ తిరుమలగిరి నుంచి వెలిశాల వైపునకు బైక్‌పై వెళ్తుండగా నాగారం మండలం ఫణిగిరి గ్రామ ఆవాస ప్రాంతం చెన్నపురం తండాకు చెందిన లకావత్ సుధాకర్ తొర్రూర్ వైపు నుంచి తిరుమలగిరికి బైక్‌పై వస్తున్నాడు. తొండ గ్రామ శివారులో ఇరువురి బైక్‌లు ఢీకొని ఇద్దరూ కిందపడ్డారు. తిరుమలగిరి వైపు నుంచి తొర్రూర్ వైపు వెళ్తున్న లారీ ఒకరి కాళ్లపై వెళ్లగా కాలు ఛిద్రమైంది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

## రామన్నపేట వైన్స్‌లో రూ.2.35 లక్షలు నగదు చోరీ

రామన్నపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి జిల్లా రామన్నపేటలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీవెంకటేశ్వర వైన్స్ దుకాణంలో రూ. 2.35లక్షల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. . రెండు రోజులుగా విక్రయిస్తున్న మద్యం డబ్బులు కౌంటర్‌లో పెట్టి తా ళం వేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి క్యాష్ కౌంటర్ వెనుక ఉన్న గదిలోని వెంటిలేషన్ పగులగొట్టి లోనికి ప్రవేశించారు. కౌంటర్ తాళాలు పగులగొట్టి కౌంటర్‌లోని నగదును ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దుకాణం నిర్వాహకుడు చిట్యాల పట్టణానికి చెందిన కోనేటి ఎల్లయ్య దుకాణం తీయగా దొంగతనం జరిగిందని గమనించి స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పుటేజీని పరిశీలించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం



ఛత్రదైత్రి

మోటకొండూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం దిలావర్‌పూర్ గ్రామంలోని మాతృశ్రీ డెయిరీ ఫామ్‌లో 6 నెలలుగా పనిచేస్తున్న ఛత్రదైత్రి (19) ఏప్రిల్ 26 నుంచి కనిపించడం లేదని కేసు నమోదైంది. ఎస్ఐ నాగుల ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నబరంగపూర్ జిల్లా, మోతీగాం మండలంలోని ఉదంగుడ గ్రామానికి చెందిన ఛత్ర మధు కుటుంబ సభ్యులతో కలిసి 6 నెలల నుంచి మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మధు కుమారుడు ఛత్రదైత్రికి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఏప్రిల్ 26న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అ సమయంలో నల్లని ప్యాంటు, చొక్కా ధరించాడని హిందీ, ఒడిశా మాత్రమే మాట్లాడుతాడని తెలిపారు. ఎక్కడ వెతికినా సమాచారం లభించకపోవడంతో మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరికైనా తెలిస్తే 871266808 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తెలిపారు.

### రైతులు అధైర్య పడొద్దు : తహసీల్దార్

గట్టుప్పల్, మే 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు అధైర్యపడొద్దని తహసీల్దార్ రాములు అన్నారు. గట్టుప్పల్ మండలంలోని తెరట్‌పల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. లారీల కొరత వల్ల ఎగుమతులకు ఇబ్బంది కలుగుతుందని, రైతులకు ఇబ్బందులు లేకుండా లోడింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

చిట్యాల, మే 7,(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ. అక్బర్ డిమాండ్ చేశారు. చిట్యాలలో బుధవారం జరిగిన సీపీఐ పట్టణ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల జరిగిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్‌కే. షరీఫ్, గుండాల సత్తయ్య, దండిగ నర్సింహ, బాల్‌రెడ్డి, రామలింగయ్య పాల్గొన్నారు.

# ఇక.. సాఫీగా ప్రయాణం

**● డబుల్ రోడ్డు మారుతున్న పిట్టంపల్లి- నల్లగొండ రోడ్డు ● కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు**



పిట్టంపల్లి నుంచి నల్లగొండకు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు పనులు

కట్టంగూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): డబుల్ రోడ్డు విస్తరణతో గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మారనున్నాయి. మండలంలోని పిట్టంపల్లి నుంచి నల్లగొండ మండలంలోని మర్రిగూడ బైపాస్ వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 5.4 కిలో మీటర్ల మేర డబుల్ రోడ్డు విస్తరణ పనులకు ఆర్అండ్‌బీ టెండర్ ద్వారా రూ.9.6కోట్లతో పనులు చేపడుతున్నారు. గతంలో పిట్టంపల్లి నుంచి మర్రిగూడ బైపాస్ వరకు సింగిల్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల టెండర్లు పిలిచి రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో ప్రయాణం సాఫీగా సాగుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**5.4 కిలో మీటర్లు రోడ్డు విస్తరణ**

రూ.9.6కోట్లతో చేపడుతున్న డబుల్ రోడ్డు పనుల్లో విస్తరణలో భాగంగా 1.8కిలో మీటర్ల మేర సీసీరోడ్లు నిర్మిస్తున్నా రు. ఏడు కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు ఐదు కల్వర్టులు పూర్తయ్యాయి. రెండు కల్వర్టు పనులు జరుగు తున్నాయి. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా నల్లగొండ మండలం చెర్లపల్లి చెర్వు అలుగు వద్ద పెద్ద బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రహదారిపై కంకర పోసి చదును చేయడంతో పాటు రహదారికి ఇరువైపులా మట్టితో ఫార్మేషన్ పనులు చేపట్టారు.

**నరక యాతన అనుభవించాం**



గతంలో ఈ రహదారి గుండా నల్లగొండ వెళ్లాలం టే నరక యాత అనుభవించాం. డబుల్ రోడ్డు విస్తరణ పనులతో గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మారడంతో పాటు భూముల విలువలు పెరు గుతాయి. డబుల్ రోడ్డు మంజూరు చేసిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశానికి కృతజ్ఞతలు.

● కొండ లింగస్వామి, పిట్టంపల్లి గ్రామస్థుడు.

**డబుల్ రోడ్డు విస్తరణతో తగ్గనున్న దూరం**



కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు

డబుల్ రోడ్డు విస్తరణతో కట్టంగూరు మండలం లోని పిట్టంపల్లి, ఇస్మాయిల్‌పల్లి, పామనగుండ్ల, ముత్యాలమ్మగూడెం, చిన్నపురి, ఎర్రసాని గూడెం, గొల్లగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు గుండా నల్లగొండకు వెళ్తుంటారు. గతంలో సింగిల్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఈ గ్రామాల ప్రజలు కట్టంగూరు -నార్కట్‌పల్లి మీదుగా నల్లగొండకు వెళ్లేవారు. డబుల్ రోడ్డు పనులు జరుగుతుండటంతో ఈ పనులు పూర్తి అయితే ఆయా గ్రామాల ప్రజలకు సుమారు ఎనిమిది కిలో మీటర్ల దూరం తగ్గడంతో పాటు సాఫీగా ప్రయాణం చేయవచ్చు.

## ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



నకిరేకల్ : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ కల్చరల్, రామగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మంగారి గుట్ట బూరుగు వృక్షంలో వెలిసిన శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. అర్చక స్వాములు కె. వెంకటేశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్షుడు దాసోజు శ్రీనివాస్, కృష్ణామాచారి, యాదగిరి, పెండోట సోము, అరుణ, వెంకటాచారి, వెంకటేశ్వర్లు, నరేంద్రబాబు, రాములు, భీష్మాచారి, కోటేశ్వరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బుధవారం గోవిందమాంబ సమేత ప్రోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గడగోజు కృష్ణమాచారి, మాజీ కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, రాచకొండ సునిల్, పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, మోకూరి చంద్రమౌళి, సంకోజు నారాయణ, భిక్షమాచారి, తాటికొండ లక్ష్మయ్య, బహురోజు రామబ్రహ్మాచారి పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నాయకులు

చిట్యాల, మే7, (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి బుధవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడల నర్సింహ్మా, బాకీ అండాలు, జిట్ట నరేష్, దుర్గేష్, కిషన్, లింగస్వామి, ఏళ్ల మారయ్య, తిరుపతి పాల్గొన్నారు.

## టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణాచారి

నకిరేకల్, మే 7, (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కుందారపు కృష్ణాచారి అన్నారు. నకిరేకల్‌లో బుధవారం జరిగిన నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. నియోజకవర్గంలో అన్ని మండాలల్లో హడ్‌హక్ కమిటీలను నియమించామని, గ్రామ కమిటీలు, మండల కమిటీలు నియోజకవర్గ కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి యాతాకుల అంజయ్య, ఎన్నికల పరిశీలకుడు పులుసు శేఖర్, పార్లమెంట్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి నూకల శ్రీధర్‌రెడ్డి, అధికార ప్రతినిధి నక్క రాంబాబు, ముదిరాజ్, గద్దపాటి వెంకటేశ్వర్లు, దొమ్మాటి సైదులు, అంతటి రాములుగౌడ్ పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి

నాంపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేద ప్రజలకు అత్యవసర సమయంలో అండగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని 13మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎరెడ్ల రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి సంజీవరెడ్డి, నేతల కొండల్‌యాదవ్, మాజీ సర్పంచులు మల్‌రెడ్డి చంద్రారెడ్డి, రాధా రాజశేఖర్‌రెడ్డి, రేవల్లి వెంకటయ్య, శ్రీను పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంతి

నల్లగొండ కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీవాసవీ కన్యాక పరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు నల్లగొండ పట్టణంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ భవన్‌లో అష్టోత్తర పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యామ మురళీ, కోటగిరి దైవాదీనం, భూపతిరాజు, చంద్రశేఖర్, గుబ్బా శ్రీనివాస్, శ్రీనివాస్, మనోహర్, రమేష్, సత్తయ్య, నాపంల్లి నర్సింహ, వెంకన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బీట్ మార్కెట్‌లోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నార్కట్‌పల్లి: వాసవీ కన్యకా పరమేశ్వరిమాత జయంతిని నార్కట్‌పల్లిలోని వాసవీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పంచామృతాలతో అభిషేకించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బిళ్లకంటి శ్రీకాంత్, పసునూరి, శ్రీనివాస్, ఇడుకుళ్ల బిక్షమయ్య, సల్లా వాసుదేవ్, కర్నాటి రమాదేవి, దోసపాటి ప్రసాద్, గంధం భాస్కర్, బండారు రమేశ్, పసునూరి సంపత్, దోసపాటి కోటయ్య, రఘు, విష్ణు పబ్బతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు సామూహిక అభిషేకాలు నిర్వహించారు. ఆర్యవైశ్య భవన్, నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీమాత దేవాలయ ట్రస్ట్ సభ్యులు బ్రహ్మదేవర పద్మ, బ్రహ్మదేవర లక్ష్మయ్య, గజ్జెల రామకృష్ణ, వీరవెల్లి రఘునాథ్, కందగట్ల సంతోష్, రేపాల కళ్యాణి, వీర్లపాటి నర్సింహారావు, రేపాల సతీష్ పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : పూజల్లో పాల్గొన్న మహిళలు

# కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి




సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు భూపాల్

నల్లగొండ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపు నిచ్చారు. స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం పని చేస్తోందన్నారు. వందేళ్ల క్రితం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులను మోసగిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తోందన్నారు. కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కును కాలరాస్తున్నారన్నారు. 9గంటల పనిని 12 గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కార్మిక ఐక్య పోరాటలను ఉధృతం చేస్తూ జాతీయ స్థాయిలో కార్మిక సంఘాలు ఇచ్చిన మే 20 దేశ వ్యాపిత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మె విజయవంతానికి ప్రచారం నిర్వహించాలన్నారు. కార్మిక వాడల్లో, పని ప్రదేశాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు డి. మల్లేష్, ఎండి సలీం, అవుతా సైదయ్య, సహాయ కార్యదర్శులు నల్ల వెంకటయ్య, మల్లు గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్‌పై ప్రజల హర్షం



నార్కట్‌పల్లిలో మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు

నార్కట్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులపై ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన ఆపరేషన్ సింధూర్‌పై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పాక్‌లోని ఉగ్రస్థావరాలను భూస్థాపితం చేసిన చర్యను అభినందించుకుంటూ మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, నడింపల్లి శ్రవణ్ కుమార్, మునుకుంట్ల గణేశ్, నోముల నాగరాజు, గూడూరు అంజిరెడ్డి, వడ్డేగోని రామలింగం, కుర్మిళ్ల రఘురామ్మూర్తి, కంచర్ల బాబూరావు, పసునూరి సంపత్, మహేందర్, ఉపేందర్, ఏర్పుల పరమేశ్, పాలకూరి రమేశ్, కొత్త మహేశ్, బోడ ప్రవీణ్, లింగాల నవీన్, శివ, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గట్టుప్పల్ పీహెచ్‌సీ నిర్మాణం దిశగా అడుగులు

**● కదిలిన అధికార యంత్రాగం**




అధికారులకు స్థలాన్ని అప్పగిస్తున్న తహసీల్దార్ రాములు

గట్టుప్పల్, మే 7 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిర్మాణానికి వెలమకన్నె రోడ్డులో స్థలాన్ని కూడా కేటాయించింది. కానీ నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో 'పీహెచ్‌సీ నిర్మాణం ఎప్పుడో..?' శీర్షికన ఈ నెల 5న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పీహెచ్‌సీ నిర్మాణానికి అడుగులు వేస్తున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు కదిలారు. ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించిన ఎకరం స్థలాన్ని చండూరు మండల వైద్యాధికారి మాస బాలు, డాక్టర్ అశోక్‌లకు తహసీల్దార్ రాములు పొజిషన్ అప్పగించారు. రెండు శాఖల్లో కదలిక వచ్చింది.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నల్లగొండ రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం కారణంగా ధాన్యం తడిసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని ముషంపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయక పోవడంతో రైతులకు నష్టం జరిగిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇష్టానుసారంగా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు జాప్య చేశారన్నారు. ముషంపల్లి గ్రామంలో బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి 7 వరకు కురిసిన అకాల వర్షంతో ఐకేపీ సెంటర్‌లో ఉన్న సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందని, ఆ ధాన్యం తడిసి రైతులు నష్టపోయారన్నారు. ఒక్క సెంటర్‌లో ఇంత నష్టం జరిగితే జిల్లావ్యాప్తంగా ఎంత నష్టం జరిగిందో అధికారులు అంచనా వేయాలని డిమాండ్ చేశారు. అప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## వెలిమినేడు మాజీ సర్పంచ్ వీరయ్య మృతి



వీరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, కృష్ణారెడ్డి



వీరయ్య(ఫైల్)

చిట్యాలరూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిమినేడు గ్రామ మాజీ సర్పంచ్, సీపీఎం నాయకుడు అరూరి వీరయ్య(72) బుధవారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సీపీఎం తరుపున వార్డు సభ్యుడిగా, ఉప సర్పంచ్‌గా, పీఏసీఎస్ చైర్మన్‌గా, సర్పంచ్‌గా పని చేశారు. 1995 నుంచి 2011 వరకు రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామాభివృద్ధిలో కీలకప్రాత పోషించారు. గ్రామపంచాయతీ పర్సన్ ఇన్‌చార్జిగా రెండు పర్యాయాలు పనిచేశారు. సీపీఎం రామన్నపేట డివిజన్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఆయన ఎన్నో సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బొంతల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి, ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్, సీపీఎం, వివిధ పార్టీల నాయకులు మేక అశోక్‌రెడ్డి, జల్లెల పెంటయ్య, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, అరూరి శ్రీనివాస్, నెలికంటి నర్సింహ, ఉడుగు వెంకటేశం, అంబటి సరేందర్‌రెడ్డి తదితరులు వీరయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పోరాటాల ద్వారానే హక్కుల సాధన

కట్టంగూరు, మే, 7 (ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఈదులూరు గ్రామంలో బుధవారం మే డే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సంపద సృష్టిస్తున్న కార్మికుల రాజ్యం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంజర్ల సైదులు, పొన్న అంజయ్య, మురారి మోహన్, వెంకన్న, వెంకటమ్మ, కాసర్ల స్వప్న, రామకృష్ణ, నాగయ్య, కర్నాటి రాములు, చింత బిక్షం, విజయలక్ష్మి ఉన్నారు.

## 'ఎరువులు అధికంగా వాడొద్దు'

తిప్పర్తి, మే 7(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధికంగా వాడొద్దని కంపాసాగర్‌లో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని తిప్పలమ్మగూడెం గ్రామంలో రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. సాగునీటి సద్వినియోగం, సాగులో అవసరమయ్యే ఎరువులు, విత్తనాల ఎంపిక, పురుగు మందుల ఎంపిక, కొనుగోలు రశీదులపై ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు అవగాహన కల్పించారు. అధిక యూరియా, ఎరువులు వాడితే కలిగే నష్టాలు, పంట మార్పిడి వలన వచ్చే లాభాలు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, ఏవో సన్నిరాజు, పీఏసీఎస్ చైర్మన్ పాశం సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదేవతల గుడి నిర్మాణాలకు విరాళాలు

నార్కట్‌పల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న ఐదు గ్రామ దేవతల ఆలయాల కోసం భక్తులు విరాళాలు ప్రకటించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య రూ.2లక్షలు, రియల్ ఎస్టేట్ వ్యాపారి కాంగ్రెస్ నాయకుడు యానాల రాంరెడ్డి రూ.2లక్షలు, కుమ్మర సంఘం పట్టణ అధ్యక్షుడు రాధారపు యాదగిరి రూ.20 వేలు, మండల సంఘం ఉపాధ్యక్షుడు రాధారపు దేవయ్య రూ.10వేలు, విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల ఉత్సవ కమిటీ నాయకులు పుల్లెంల అచ్చాలు, రాధారపు బిక్షపతి, సట్టు సత్తయ్య, జెనిగె బిక్షం, దుబ్బాక శ్రీధర్, సామ కొండల్‌రెడ్డి, లింగాల రాములు, ప్రజ్ఞాపురం రాములు, మిర్యాల రాములు, కొప్పు శ్రవణ్ పాల్గొన్నారు.

## రాత్రి 11 గంటల లోపు దుకాణాలు మూసివేయాలి

నార్కట్‌పల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ రాత్రి 11గంటల లోపు వ్యాపారులు తమ వ్యాపార సంస్థలను మూసివేయాలని నార్కట్‌పల్లి ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కూరగాయలు, కిరాణా అండ్ జనరల్ స్టోర్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, చికెన్ షాపులు, జాతీయ, రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఉన్న హోటళ్లు, దాబాలను మూసివేయాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ



శిక్షణ పొందుతున్న చిన్నారులు

నల్లగొండ/నల్లగొండ స్పోర్ట్స్, మే 7(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు ఉపకరించే యుద్ధ క్రీడను పదిమందికి నేర్పించి రక్షణ భావాన్ని పెంపొందించడానికి కృషిచేస్తున్నారు. ఆత్మస్థైర్యాన్ని నింపే విధంగా బాల, బాలికలు తైక్వాండోలో తర్ఫీదు పొందుతున్నారు. మార్షల్ గేమ్స్ పై పిల్లలకు శిక్షణ ఇప్పించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో కోచ్ అంబటి ప్రణీత్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వేసవి ఉచిత తైక్వాండో క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి బాల,బాలికలకు యువతీ,యువకులకు శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా జిల్లాకేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి తైక్వాండో శిక్షణ శిబిరంలో బాల, బాలికలకు యువతి, యువకులకు మేటి తైక్వాండో క్రీడాకారులుగా తయారయ్యే విధంగా కోచ్ మెలకువలు నేర్పిస్తున్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తున్నారు.

**ఆత్మరక్షణ కోసమే మార్షల్ క్రీడ**



మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే ఆందోళన చెందుతున్నారు. తైక్వాండోలో శిక్షణ పొందడం వలన ఆత్మ రక్షణ ఏర్పడుతుంది. ధైర్యంగా సమస్యనైనా జయిస్తామనే నమ్మకం కలుగుతుంది.

బి. యశ్వతి

**ఉల్లాసంగా ఉంది**



తైక్వాండో శిక్షణ పొందడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రెండు పూటలా వ్యాయామం చేయడంతో శరీరం ఉల్లాసంగా ఉంటుంది. ఉత్సాహంగా ఉండడంతో చేసే పనిపై దృష్టి పెట్టగలుగుతున్నాం.

కె. యశ్వంత్

**బాలికలకు మార్షల్ ఆర్ట్స్ అవసరం**



కరాటే కిక్ బాక్సింగ్ తైక్వాండో తదితర క్రీడలు మార్షల్ ఆర్ట్స్‌గా గుర్తిస్తారు. ఈ క్రీడ పై ఆసక్తి ఉన్నవారికి పాఠశాలల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నాను. వేసవి శిక్షణ శిబిరాన్ని పది సంవత్సరాల నుంచి కొనసాగిస్తున్నాం.

● అంబటి ప్రణీత్, తైక్వాండో కోచ్



## అంతటా ఉద్వేగం

- ఆపరేషన్ 'సింధూర్'పై హర్షం
- రోజంతా ఫోన్లు, టీవీలకే అతుక్కుపోయిన ప్రజలు
- దాడుల వీడియోలతో హోరెత్తిన సోషల్ మీడియా
- నిఘా పెంచిన పోలీసులు
- మతసామరస్యాన్ని చాటిన ఉమ్మడి జిల్లా ప్రజలు

పహల్గామ్ ఉగ్రదాడికి బదులుగా భారత త్రివిధ దళాలు దాయాది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ 'సింధూర్' పేరుతో చేసిన వైమానిక దాడులు ఉమ్మడి జిల్లా ప్రజల్లో ఉద్వేగాన్ని నింపాయి.

- (ఆంధ్రజ్యోతి, భువనగిరి టౌన్)

పాకిస్థాన్‌లో బుధవారం తెల్లవారు జామున 1.45 గంటలకు చేసిన ఈ దాడులు ఇండియన్ ఆర్మీ ఎక్స్ (ట్విట్టర్) పోస్టుతో వెలుగు చూశాయి. ఆ వెంటనే సోషల్ మీడియా, టీవీ చానెల్స్‌లో బ్రేకింగ్ వార్తలు వెల్లువెత్తాయి. అప్పటివరకు మెళకువతో సెల్‌ఫోన్లకు, టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు దాడి వార్తలతో హర్షం వ్యక్తం చేశారు. ఆ వెంటనే వారు కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో పాటు పలువురికి ఫోన్లు చేసి వార్తను పంచుకున్నారు. తెల్లవారుజామున నిద్రమత్తును వీడి 15 రోజులుగా పడుతున్న బాధకు ప్రధాని నరేంద్రమోదీ శుభం పలికారని కొనియాడారు. టీవీల చానెల్స్ మారుస్తూ సైనికుల పరాక్రమాన్ని కనులారా చూసి పులకించారు. మీడియా సమావేశంలో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపిన తీరును సైనిక అధికారులు వివరించగా, ఆపరేషన్ 'సింధూర్' పేరు ఎంపికకు కారణాలను వివరిస్తున్న క్రమంలో టీవీలను చూస్తున్న పలువురు ఉద్విగ్నతకు గురయ్యారు. అనంతరం ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఆలకించారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్‌ల డీపీలు, స్టేటస్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ తదితర సోషల్ మీడియాల్లో ఆపరేషన్ సింధూర్ లోగో, మిసైల్స్ దాడుల పోస్టులతో నిండిపోయాయి. ఏ ఇద్దరు కలిసినా ఆపరేషన్ 'సింధూర్'పైనే చర్చ, మాట ముచ్చట సాగింది. అయితే పహల్గామ్ దాడి పేరుతో మత విద్వేషాలను సృష్టించాలనుకున్న పాకిస్థాన్ పన్నాగానికి భిన్నంగా ఉమ్మడి జిల్లా ప్రజలు సామరస్యంగా ఉండి పరిణతి చాటారు.



వలిగొండ శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల మాక్ డ్రిల్

### నా కుమారుడు సైనికుడైనందుకు గర్వంగా ఉంది



నా కుమారుడు సైనికుడైనందుకు గర్వపడుతున్నా. సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో మాలో ఆందోళన ఉంది. కానీ, దేశ రక్షణ కోసం యుద్ధ రంగంలో నా కుమారుడు ఉండటం అదృష్టంగా భావిస్తున్నా. దేశ కోసం తన వంతు త్యాగం చేస్తానంటూ ఇష్టంతో సైన్యంలోకి వెళ్లాడు. పహల్గామ్ దాడులు జరిగినప్పటి నుంచి ప్రతి రోజూ ఫోన్‌లో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నా. కానీ, ప్రతిసారి మాట్లాడలేకపోతున్నాడు. టీవీల్లో యుద్ధ వార్తలు చూస్తున్నప్పుడు భయమేస్తోంది. ఆ వెంటనే తేరుకొని మాకు మేం ధైర్యం చెప్పుకుంటూ దేశం గెలవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం.

- రత్నపురం వెంకటమ్మ, భువనగిరి

### సైనికుల కుటుంబాల్లో..

ఆపరేషన్ 'సింధూర్' నేపథ్యంలో సైనికుల కుటుంబాలు ఉద్వేగానికి గురయ్యాయి. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భారత సైన్యంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నవారు ఉన్నారు. దాయాది పాకిస్థాన్‌తో యుద్ధ మేఘాలు అలుముకుంటుండడంతో సైనికుల సంక్షేమం, భద్రతపై ఇక్కడున్న తల్లిదండ్రులు, భార్యలు, పిల్లల్లో ఆందోళన నెలకొంది. అయినా దేశ భద్రతకు తమ కుటుంబం త్యాగం చేస్తోందని గుండె నిబ్బరం చేసుకున్నారు. పరిచయస్థులు సైనికుల కుటుంబీకులను కలుస్తూ ధైర్య వచనాలు చెబుతున్నారు. సెలవులను రద్దు చేయడంతో ఇళ్లకు వచ్చిన సైనికులంతా తిరుగు ముఖంపట్టారు. అలాగే పోలీసులకు అన్ని రకాల సెలవులను కూడా రద్దు చేసి వెంటనే విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పోలీసులు ఉమ్మడి జిల్లా అంతటా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీలను ముమ్మరం చేసి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. వలస కార్మికుల వివరాలు నమోదు చేస్తున్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు

**ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్**



డిపోలో మొక్కలు నాటుతున్న ఈడీ ఖుస్రో షా ఖాన్

నల్లగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్ అన్నారు. బుధవారం నల్లగొండ డిపోను ఆయన సందర్శించి, డిపో ఆవరణలో మొక్క నాటారు. అనంతరం బస్సులను, గ్యారేజీని పరిశీలించి మెకానికల్‌లు, డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడారు. సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయన వెంట రీజనల్ మేనేజర్ కె.జానిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## చిన్నారుల రక్షణ కోసం 'ఊయల'



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఊయల

నల్లగొండ, మే 7 (ఆంధ్రజ్యోతి): వదిలివేసిన పిల్లలను సంరక్షించేందుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి, శిశుగృహ, అన్ని ప్రసూతి వైద్యశాలల్లో ప్రత్యేకంగా ఊయల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి మాట్లాడుతూ, జిల్లాలో ఎవరైనా పిల్లలను వదిలి వేయడం లాంటివి చేయకూడదన్నారు. పిల్లలను పోషించలేని తప్పని పరిస్థితి ఉంటే ఊయలకు అప్పగించాలని కోరారు. ఎవరికైనా పిల్లలు కావాలంటే మహిళ శిశు సంక్షేమశాఖ అధికారులను సంప్రదించి చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని,సూచించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణ, సభ్యుడు ఈద బాస్కర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ కుమారి, మెడికల్ ఆఫీసర్ రజిని, బీఆర్‌బీ కోఆర్డినేటర్ హరిత, డీసీపీయూ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు

ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. అందుకు అనుగుణంగా ఉద్యాన పంటల సాగుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. రైతుల ప్రయోజనం కోసం ఈ సారి రెండు నెలల ముందే అధికారులు ఈ ప్రణాళికను రూపొందించారు. ప్రధానంగా కూరగాయల సాగు గణనీయంగా పడిపోతుండటంతో, వీటి విస్తీర్ణాన్ని పెంచేందుకు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



- కూరగాయల సాగుతో పాటు పలు పంటలకు రాయితీలు
- మల్బరీ తోటలపై దృష్టి సారించిన అధికారులు
- సబ్సిడీపై డ్రిప్ మంజూరుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో కూరగాయల సాగు పెంచాల్సిన అవసరంపై అధికారులు ఇప్పటికే నివేదిక సిద్ధం చేశారు. ఈ రెండు జిల్లాతో పాటు సూర్యాపేట జిల్లాలో కూడా ఉద్యాన పంటలను పెద్ద సంఖ్యలో ప్రోత్సహించనున్నారు. కేవలం బత్తాయి, నిమ్మ పంటలేగాక ఇతర పంటలను కూడా విస్తరిస్తే రైతులు ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయి. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేసి కార్యాచరణకు ఆమోదం తెలిపింది. గతంలో బత్తాయి తోటలు పెద్ద సంఖ్యలో ఉండేవి. రానురానూ తోటలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో ఉద్యాన పంటల్లో భాగంగా అన్నింటి సాగుకు ప్రోత్సాహకాలు ఇస్తూ రైతులకు ప్రయోజనం చేకూర్చాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

### 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలు

రాష్ట్ర ప్రభుత్వం 2025-26లో ఉద్యాన పంటల ప్రణాళికను వెల్లడించింది. ఆయిల్‌పామ్ సాగును విస్తరించడంలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సూక్ష్మనీటి పారుదల పథకం సమన్వయంతో మూడు జిల్లాల్లో దాదాపు 15వేల ఎకరాలకు లబ్ధిదారులకు మొక్కలను పంపిణీ చేయనున్నారు. నల్లగొండ జిల్లాలో 6500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేలా అధికారులు ప్రణాళికలను రూపొందించారు. డ్రిప్‌ను సైతం రాయితీపై అందించనున్నారు. రైతులు ముందుకు వస్తే సుమారు 12.50లక్షల ఎకరాలకు రాయితీపై డ్రిప్ అందించనున్నారు. ఆయిల్‌పామ్ మొక్కలకు ఇప్పటికే రాయితీ ఇస్తున్నారు. పీఎంకేఎస్‌వై (ప్రైమ్‌మినిస్టర్ క్రిషి సించాయి యోజన) కింద పండ్ల తోటలతో పాటు కూరగాయలకు, మిరప, ఆయిల్‌పామ్ సాగుకు బిందు, తుంపర సేద్యాన్ని రాయితీపై పరికరాలు అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 100శాతం రాయితీ, బీసీ, సన్నచిన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీ ఇవ్వనున్నారు.

### సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకంలో

సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం (ఎంఐడీహెచ్)లో

మిగతా 7వ పేజీలో...

### రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యాన పంటలతో పాటు కూరగాయల సాగుకు, ఇతర పంటల సాగుకు ప్రోత్సాహం అందుతుంది. ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. డ్రిప్‌ను కూడా సబ్సిడీపై అందజేస్తాం. ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం.

- పి.అనంతరెడ్డి, ఉద్యాన, పట్టుపరిశ్రమల అధికారి, నల్లగొండ

### ఉపాధి ముమ్మరం.. సౌకర్యాలు మృగ్యం

ఆంధ్రజ్యోతి విజిట్ • 6లో..

- తాగునీరు, టెంట్ కరువు
- వేసవిలో తల్లడిల్లుతున్న కూలీలు
- అందుబాటులో లేని మెడికల్ కిట్లు
- అప్పుడప్పుడు ఓఆర్ఎస్



వాసవీ కన్యాక పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా నల్లగొండలో నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు • 8లో..

### విశ్రాంత ఆవేదన

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూపులు • 7లో..
- ఒక్కొక్కరికీ రూ.50 నుంచి రూ.70లక్షల వరకు బకాయిలు
- సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో 1,037మంది రిటైర్

## ధాన్యం లారీలు రాకుండా చెక్‌పోస్టు వద్ద పకడ్బందీ చర్యలు

**ఎస్పీ శరత్‌చంద్ర పవార్**



వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దామరచర్ల, మే 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రాంతం నుంచి ధాన్యం లారీలు రాకుండా రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం వాడపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీచేసి పలు రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. అనంతరం వాడపల్లి చెక్‌పోస్టును తనిఖీచేసి మంగళవారం రాత్రి ఆంధ్రా నుంచి వచ్చిన ధాన్యం లారీ పట్టుబడగా పరిశీలించారు. ఆంధ్రా నుంచి అక్రమంగా ధాన్యం లారీలు రాకుండా వాడపల్లి, విజయపురి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఇప్పటికే అక్రమంగా ధాన్యాన్ని తరలిస్తున్న ఏడు లారీలను పట్టుకొని కేసులను నమోదు చేశామన్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రూరల్ సీఐ పీఎండీ.ప్రసాద్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### అవార్డు గ్రహీతలకు ఎస్పీ అభినందన

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): తెలంగాణ రియల్ హీరోస్ అవార్డు గ్రహీతలను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. కొన్ని నెలల క్రితం అంతర్ రాష్ట్ర దొంగల ముఠా, పార్థీ గ్యాంగ్‌ను చాకచక్యంగా పట్టుకున్న బృందంలో సభ్యులుగా ఉన్న సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్, ఐటీ కోర్ విభాగం గిరితో పాటు కానిస్టేబుల్ విక్రమ్ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి తెలంగాణ రియల్ హీరోస్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఎస్పీ అభినందించారు.



### కేజీబీవీ విద్యార్థినికి విమాన ప్రయాణం

- హామీ నిలబెట్టుకున్న నల్లగొండ జిల్లా కలెక్టర్ • 6లో..
- 10/10 జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం చేయిస్తానని గతంలో హామీపత్రం
- విమాన ప్రయాణం, సౌకర్యాలకు సొంత ఖర్చుతో ఏర్పాట్లు

## రైతుల నుంచి పైసలు తీసుకుంటే చర్యలు

**ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై కలెక్టర్ ఆగ్రహం**



శాపల్లిలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నార్కట్‌పల్లి,మే7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చిన రైతులనుంచి పైసలు తీసుకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ ఇలాత్రిపాఠి హెచ్చరించారు. ప్రతీ బస్తాకు రూ.4 చొప్పున తీసుకుంటున్నారని రైతులు ఆమె దృష్టికి తేగా కలెక్టర్ పై విధంగా స్పందించారు. నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం తేమను స్వయంగా ఆమె పరిశీలించారు. వర్షానికి ధాన్యం తడిసిపోకుండా కాంటా వేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలన్నారు. లారీలు సకాలంలో రాని కారణంగా ధాన్యం తరలింపులో జాప్యం జరుగుతోందని రైతులు ఆరోపించారు. స్పందించిన కలెక్టర్ కేంద్రానికి ఏయే తేదీన లారీలు వచ్చాయని అడిగారు. ఈ నెల 2, 5 తేదీల్లో లారీలు వచ్చాయని చెప్పారు. కానీ రికార్డులో నమోదు చేయకపోవడం పట్ల కేంద్రం నిర్వహకుల పట్ల కలెక్టర్ ఆగ్రహం చెందారు. కార్యక్రమంలో డీఎస్‌వో హరీశ్, నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి, డీసీవో పాత్యానాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఏపీఎం శ్రీదేవి, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.

### వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలి

శాలిగౌరారం: జిల్లాలో వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. శాలిగౌరారం మండలం రామగిరి శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేశారు. మిల్లులకు పంపించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను తనిఖీ చేయగా, ఆ బస్తాలలో తాలు, తరుగు ఉండడంపై సెంటర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్ ఇన్‌చార్జి నిమ్మల కృష్ణమూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక షో కాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, ఆర్డీవో యానాల అశోక్ రెడ్డి, డీసీవో పత్యా నాయక్, తహసీల్దార్ యాదగిరి పాల్గొన్నారు.

### భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

నకిరేకల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంతో సాదాబైనామా, పీవోటీ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. నకిరేకల్ మండలాన్ని పైలెట్ మండలంగా ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. రైతులు సమస్యలుంటే గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ జమీరొద్దిన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై పోరుకు సంపూర్ణ మద్దతు

**ఎంపీ రఘువీర్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదంపై పోరుకు సంపూర్ణ మద్దతి ఇస్తున్నామని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, దేశ రక్షణ, సమైక్యత, సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు భారత పౌరుడిగా సంపూర్ణ మద్దతి ఇస్తున్నానన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం మనసును కలిచి వేసిందన్నారు. ఉగ్రదాడికి దీటుగా జవాబిచ్చేందుకు భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్తాన్‌లోని ఉగ్రవాదస్థావరాలను ధ్వంసం చేయడం హర్షనీయమన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1971లో తూర్పు పాకిస్తాన్‌ను స్వాధీనం చేసుకున్నారని గుర్తుచేశారు. ఆపరేషన్ సింధూర్‌తో విచ్ఛిన్నకర శక్తులకు గట్టిగా బుద్ధి చెప్పినట్టు అయిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే ఆలేరు వెంకటేశం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రూ.30లక్షలు మంజూరు చేయాలి

**కలెక్టర్‌కు లేఖ రాసిన ఎంపీ చామల**

శాలిగౌరారం,మే 7(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని ఊట్కూరు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.30లక్షల నిధులు మంజూరు చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠికి లేఖ రాశారు. ఊట్కూరు గ్రామంలో తాగు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారని, భూభారతి చట్టం అవగాహన సదస్సులో గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారని, వెంటనే వారి దాహార్తిని తీర్చేందుకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30లక్షలు కేటాయించాలని కోరారు.

## సాగర్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్

నాగార్జునసాగర్,మే7(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రాజశేఖర్ నిడమనూరు మండలం వేంపాడు బీసీ గురుకుల పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ బీసీ గురుకుల పాఠశాల నుంచి రవికుమార్ బదిలీపై సాగర్‌కు వచ్చారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరచర్ల, మే7(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడలోని 33కేవీ మాటూర్ ఫీడర్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అబ్దుల్లా హబీబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 7 నుంచి 11గంటల వరకు దామరచర్ల మండలం తిమ్మాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ, మే 7(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మండలంలోని మర్రిచెట్టుతండాలో ట్రైకర్ నిధులు రూ.15 లక్షలతో మైత్రి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నిర్మించిన గోదాంను బుధవారం ఆయన ప్రారంభించారు. మైత్రి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

దేవరకొండ పట్టణంలోని 16వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ మునిసిపల్ పరిధిలో రూ.50 కోట్లతో అన్ని వార్డులు, కాలనీలలో రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాసవీమాత జయంతి పురస్కరించుకొని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానించారు. అనంతరం పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా బ్రహోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు అనంతరం దేవరకొండ మండలం శక్రుతండాలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాబార్డు అధికారి రవీంద్రనాయక్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీడీవో డానియేల్, స్పెషల్ ఆఫీసర్ శంకర్, కొర్ర గౌతమి రాంసింగ్, హరికృష్ణ, సీత్యానాయక్, శీనునాయక్, లక్ష్మణ్‌నాయక్ కాంగ్రెస్ పార్లమెంట్ నల్లగొండ కో ఆర్డినేటర్ ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, పున్న వెంకటేష్, శ్రీశైలం యాదవ్, జయప్రకాష్, హరికృష్ణ పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

మాడ్గులపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించి ఆయన మాట్లాడారు. అకాల వర్షానికి ధాన్యం తడిసే అవకాశం ఉన్నందున రైతుల ఇబ్బందులను గుర్తించి అధికారులు ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేసి కేంద్రం నుంచి లారీల ద్వారా తరలించాలని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుండా నవీన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, పాలూరి వెంకట్‌రెడి శ్రీకాంత్‌రెడ్డి, గంగరాజు, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

కొండమల్లేపల్లి, మే 7, (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి తహసీల్దార్ నరేందర్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులను పరిశీలించారు. లారీల యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి త్వరగా లారీలు కొనుగోలు కేంద్రానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## రైతులు గుర్తింపు కార్డు పొందాలి

వేములపల్లి, అడవిదేవులపల్లి మే 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే రైతు సంక్షేమ పథకాల కోసం రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని వేములపల్లి, అడవి దేవులపల్లి మండల వ్యవసాయాధికారులు రమావత్ కిశోర్‌నాయక్, గుర్రం సరిత బుధవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. జనవరి 1, 2025 నాటికి డిజిటల్ సైన్ పొంది పట్టా పాస్‌పుస్తకం కలిగిన రైతులందరూ కార్డు పొందాలని సూచించారు.. ఇందు కోసం రై తులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను తీసుకొని ఏఈవోలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

## స్నేహితుడికి చేయూత



రవి భార్య హేమంతకు ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

త్రిపురారం మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిగూడెం గ్రామానికి చెందిన గజ్జి రవి ఏప్రిల్ 19న రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి చికిత్స పొందుతున్నాడు. అయితే అతడితో పాటు ముకుందాపురం శాంతి నికేతన్ ఉన్నత పాఠశాలలో 2004-05లో విద్యనభ్యసించిన పదోతరగతి విద్యార్థులు ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.1.20 లక్ష రవి భార్య హేమంతకు హైదరాబాద్‌లో అందించారు. కార్యక్రమంలో మేకల శంకర్, అనుముల నవీన్, ఝాన్సీ జల్లేపల్లి ఉపేందర్, గుండెబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీమాతకు ప్రత్యేక పూజలు

చింతపల్లి, మే7(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని పురస్కరించుకొని వెంకటేశ్వరనగర్‌లోని శివాలయంలో ఆర్యవైశ్యులు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా వాసవీమాత చిత్రపటానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు చేశారు .అనంతరం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో చింతపల్లి మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడు వాస శ్రీనివాస్, ఆలయ కమిటీ ఛైర్మన్ పూరె లక్ష్మణ్, పూరె బాల్‌రాజ్, వెంకటయ్య, రాంమోహన్, అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, పాల్గొన్నారు.



వీ.టీ.నగర్‌లో వాసవీ మాత పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

# రోడ్డు ఇలా.. ప్రయాణమెలా



గుంతలమయంగా ఉన్న పాములపాడు- భీమవరం రోడ్డు.

» పాములపాడు - భీమారం గ్రామాల మధ్య అధ్వానంగా రహదారి
» పట్టించుకోని అధికారులు
» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి-మాడ్గులపల్లి):

గ్రామీణ రహదారు ల కోసం ప్రభుత్వం పనిచేస్తుందని చెప్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యంగా కనిపిస్తుంది. మాడ్గులపల్లి మండలం పాములపాడు గ్రామం నుంచి కేతేపల్లి మండలం భీమవరం వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారడం కంకరతేలి ఉం డడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ రోడ్డును ఏర్పాటు చేసినా కొద్ది రోజులకే రోడ్డు గుంతలు ఏర్పడడంతో ఈ రహదారిని పట్టించుకునేవారు కరువవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తుంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపు లా కంపచెట్లు పెరగడంతో ప్రయాణం సాగించలేని పరిస్థితి నెలకొంది.గ్రామస్థులు ఈ రహదారి గుండా ప్రయాణంచేయాలంటే నరకయాతన పడాల్సి వస్తుంది. ఆటోలుసైతం ఇటువైపు రావడం లేదు. త మ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, ప్ర జాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలి తం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**రెండు జిల్లాలకు ఈ రోడ్డే ప్రధానం..**

మాడ్గులపల్లి మండలం పాములపాడు, భీమవ రం నాలుగు కిలోమీటర్ల పరిధిలోని ఈ రోడ్డు సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు అనుసంధానంగా ఉండడంతో వాహనదారులు సూర్యాపేట నుంచి నల్లగొండకు పనుల నిమిత్తం ఈ రోడ్డు గుండానే ప్ర యాణం చేయాల్సి ఉంది. మాడ్గులపల్లి మండలంలో నికుక్కడం, తోపుచర్ల, మాడ్గులపల్లి, ఆగామోత్కూర్, ఇందుగుల, కల్వలపాలెం, భీమనపల్లి, చర్లగూడెం, పోరెడ్డిగూడెం, చిరుమర్తి గ్రామాలతోపాటు తిప్పర్తి మండలంలోని సర్వారం, ఎల్లమ్మగూడెం, గోదారిగూడెం గ్రామాల ప్రజలు సూర్యాపేటలోని వివిధ కంపెనీల్లో పనుల కోసం నిత్యం ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఎంతో మంది ప్రజలు పాములపాడు, కేతేపల్లి మం డలం తుంగతుర్తి, ఉప్పలపాడు, కొప్పోలు, సూర్యాపేట జిల్లాలోని టేకుమట్ల, రాయినిగూడెం 65వ జాతీయ రహదారి పై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దూర భారం పెరిగిపోవడంతో ఆర్థి కంగా నష్టపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సూర్యాపేట జిల్లాల నుంచి మా డ్గులపల్లి మండలం పాములపాడు, చిరుమర్తి, పోరెడ్డిగూడెం, కల్వలపాలెం, బొమ్మకల్, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం, చిన్నగూడెం గ్రామాల్లో ఉపాధ్యాయులు ఈ రోడ్డు గుండానే వివిధ పాఠశాలలకు వస్తుంటారు.

ఈ రోడ్డు అధ్వానంగా తయారవడంతో ఎక్కువ మంది ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు వేములపల్లి మండలం ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం గ్రామాల నుంచి తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మాడ్గులపల్లి మండలం పలు గ్రామస్తులు సూ ర్యాపేట జిల్లాలోని కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి వస్తుంది. బస్సు సౌకర్యం లేకపోవడం, ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆటోలు రాకపోవడంతో విద్యార్థులు భీమవరం వరకు వెళ్లి నడుచుకుంటూ గాని ఇతర వాహనాలను లిఫ్ట్ అడిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొం ది. సూర్యాపేట జిల్లా ప్రజలు నల్లగొండకు వెళ్లాలం టే ఈ రోడ్డుగుండానే ప్రయాణం చే యాల్సి ఉంది. ఈ రోడ్డు గుంతలమయంగా ప్రమాదకరంగా ఉండడంతో ఎక్కువ మంది ప్రజలు సూర్యాపేట, రాయినిగూడెం, టేకుమట్ల, కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూర్ నుంచి ప్రయాణించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభు త్వం దృష్టిసారించి ఈ రోడ్డు పనులకు మరమ్మతులు చేయించాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ప్రయాణం చేయలేకపోతున్నాం**



పాములపాడు- భీమవరం గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వాన్నంగా మారింది ఈ రోడ్డుపై ప్రయా ణించాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. దీంతో చేసేదేమి లేక చుట్టు తిరిగి ప్రయాణం చేస్తున్నాం. అధికారులు ఈ రోడ్డు పనులకు మరమ్మతులు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- ఏర్పుల వెంకటయ్య (పాములపాడు)

**టెండర్ దశలో ఉంది**



మాడ్గులపల్లి మండలం పాములపాడు- భీమవరం నాలుగు కిలోమీటర్ల మేరా ఉన్న రోడ్డు టెండర్ దశలో ఉంది. ఈ రోడ్డుకు ప్రభుత్వం ఎంఆర్ఆర్‌లో భాగంగా రూ.1.60 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, టెండర్ పూర్తి కాగానే పనులను ప్రారంభించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- మధు (పీఆర్ ఏఈ)

## అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ ● రైస్‌మిల్లర్స్, అధికారులతో సమీక్షా సమావేశం



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 7(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్‌మిల్లుల వద్ద అన్‌లోడింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ సూచించారు. స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మిల్లర్స్ అధికారులలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల వర్షాలు ధాన్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉన్నందున రైతులు నష్ట పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోలు నుంచి ధాన్యం లారీలు రాగానే అన్‌లోడింగ్ చేసి పంపే విధంగా చూడాలన్నారు. తగినన్నీ లారీలు అందుబాటులో ఉండేలా చూసి వెంటనే కాంటాలు వేసి ధాన్యాన్ని మిల్లులకు చేర వేసే విధంగా చూడాలన్నారు. సమావేశంలో డీసీఎస్‌వో వెంకటేశ్, మిర్యాలగూడ తహసీల్దార్ సంతోష్ కిరణ్, రైస్‌మిల్లర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్వాసితుల ఇళ్ల నిర్మాణంపై దర్యాప్తు చేయాలి**

యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు కింద ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు శాంతినగర్ గ్రామపంచాయతీ కింద మోదుగుల కుంటతండా, కపూర్‌తండాల్లో ఇళ్ల నిర్మాణంపై సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరుతూ నిరా సితులు బుధవారం అదనపు కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయా గ్రామాల్లో ఒక్కొ ఇంటి నిర్మాణానికి రూ. 5,04,000 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఇళ్ల నిర్మాణానికి శాంతినగర్ మాజీ సర్పంచ్ భర్త రూపావత్ ఈశ్వర్‌నాయక్ ఆయన కుమారుడు విజయ్ కాంట్రాక్ట్ తీసుకున్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మరో రూ. 1.04 లక్షలు తమకు రావాల్సి ఉండగా అధికారులకు లంచం ఇచ్చానని, జీఎస్టీ కింద ఖర్చు అయిందని పొంతనలేని సమాధానాలు చెపుతున్నాడని లబ్ధిదారులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి ఇళ్ల నిర్మాణంపై సమ గ్ర దర్యాప్తు చేయాలని కోరారు. దీంతో స్పదించిన సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ విచారణ చేపట్టాలని దామరచర్ల తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మోదుగులకుంట తండా, కపూర్‌తండా గ్రామస్థులు పి.సైదయ్య, గంధం లింగయ్య, రమేష్, నారాయణ, అంతయ్య, నారాయణ, ఏడుకొండలు, సంతోష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ తుంగపాడు గ్రామ కమిటీ ఎన్నిక



టీడీపీ తుంగపాడు గ్రామశాఖ కమిటీ

మిర్యాలగూడ రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగపాడు టీడీపీ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు, పరిశీలకులు మండవ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా అనుముల సైదులు, ఉపాధ్యక్షుడిగా సజ్జల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె.రఫీ, అధికార ప్రతినిధిగా చల్ల విజయ రామారావుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చేలా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చిలకల వెంకన్న, జిల్లా నాయకులు సజ్జల రామానుజన్‌రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మచ్చ సైదులు, శంకర్‌రావు పాల్గొన్నారు.

## చింతపల్లిలో పట్టపగలే చోరీ

● 4.5 తులాల ఆభరణాలు, నగదు అపహరణ



చింతపల్లి : వేలి ముద్రలు సేకరిస్తున్న పోలీసులు

చింతపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చింతపల్లి మండలకేంద్రంలోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం...చింతపల్లి మండలకేంద్రానికి చెందిన కుక్కడాల వెంకన్న ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. అయితే మధ్యాహ్నం వెంకన్న అత్త గండు భారతమ్మ ఇంటికి వచ్చింది. ఆమె వచ్చే సమయానికి తలుపులు పగులగొట్టి ఉండటంతో సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు ఇంటికి వచ్చి చూసే బీరువాలో ఉన్న 4.5 తులాల బంగారు ఆభరణాలతో పాటు దాదా పుగా రూ.30 వేలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. దీంతో ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్ఐ తెలిపారు.

## చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



హాలియాలో పోస్టర్ దహనం చేస్తున్న నాయకులు

హాలియా,మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా అడ్మిషన్స్ స్వీకరిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల యా జమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శి నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం హాలియాలో ఆ పాఠశాల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్రోచర్లను తొలగించి వారు మాట్లాడారు. ఆకర్షణీయమైన బ్రోచర్లతో తల్లితండ్రులను మోసం చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు అనుమతి లేదని ప్రకటించినా వాళ్లు ప్రచారం కొనసాగించడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు వర్షిత్, సాయి, ఎస్ఎఫ్ఐ తదితరులు పాల్గొన్నారు.

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బ్రోచర్లు దహనం**

ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో చైతన్య పాఠశాల వాల్ పోస్టర్స్, కరపత్రాలను దహనం చేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ చైతన్య పాఠశాల యాజమాన్యం అనుమతి లేకుండా హాలి యా, దేవరకొండ పట్టణంలో బ్రాంచీల ఏర్పాటు చేసి అడ్మిషన్స్ నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు ఈయొక్క పాఠశాలను రద్దు చేసి యాజమాన్యంపై క్రిమినకల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, కిరణ్, మహేష్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**అనుమతిలేకున్న ప్రచారం చేస్తున్న విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలి**

దేవరకొండ : ప్రభుత్వ అనుమతి లేకపోయినప్పటికీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్య తీసు కోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. దేవరకొండలో శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం ఫ్లెక్సీలను తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతిలేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించవద్దని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్, కార్తీక్, నాయకులు అర్జున్, మనోహర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం



పండ్లను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

కొండమల్లేపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని మల్లెలగట్టుపై గల గోవింద మాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధాన మహో త్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మూల మంత్రయజ్ఞం, పూర్ణాహుతి మహోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తా వద్ద పండ్లు పంపిణి చేశారు. ఆలయంలో అన్న దానం చేపట్టారు. కార్యక్రమంలో పస్నూరి యుగేందర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, కమిటి అధ్యక్షుడు కర్నెకంటి జంగాచారి, పస్నూరి నరేందర్‌చారి, మల్లోజు వీరాచారి, అచ్యుతాచారి, అందోజు వెంక టాచారి, బొల్లోజు వెంకటాచారి, పోలోజు శివచారి, నారోజు సైదాచారి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు కేటాయించాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చింతపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ. మండలంలో అర్హులైన సుమారు 25 మంది పేర్లను తొలగించడంలో అధికారుల పాత్ర ఉందని ఆరోపించారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రభుత్వం చేపట్టిన పథకాలు పారదర్శకంగా మం జూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై త్వరలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు గ్రామశాఖ అధ్యక్షుడు అశోక్, చంద్రశేఖర్, అంజనేయులు, శంకర్, పెద్దయ్య, ఎండి.ఖలేద్, యాదయ్య, భాస్కర్, పవన్, నరసింహ పాల్గొన్నారు.

## లచ్చిరాంనాయక్‌కు ఘన నివాళి

హాలియా,మే 7(ఆంధ్రజ్యోతి): దివంగత నేత ఆంగోతు లచ్చిరాంనాయక్ 9వ వర్ధంతిని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ తన జీవితకాలమంతా గిరిజన సంప్రదాయ సంస్కృతుల రక్షణకు పాటుపడిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు దీరావత్ స్కైలాబ్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షులు ధనావత్ భాస్కర్‌నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుందూరు వెంకట్‌రెడ్డి, వెంపటి శ్రీనివాస్, పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

## విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

గుడిపల్లి(పెద్దఅడిశర్లపలి),మే7(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలం భీమన పల్లి గ్రామంలో బుధవారంవి ద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. బాధితుడు తెలిసిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం కంభంపాటి శ్రీన య్యకు చెందిన రెండు గేదెలు వ్యవసాయ పొలంలో మేత మేయడానికి వెళ్లాయి. ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి పొలంలో పడిపోయాయి. మేతకు వెళ్లిన ఆ రెండు గేదెల కాళ్లకు విద్యుత్ తీగ తగిలి అవి కూడా అక్కడిక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తనకు పరిహారం అందించాలని వేడుకున్నారు.